

# మహాభారతం

## కురుసామ్రాజ్యాధిపత్య నిర్ణయము 11


రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716


(గతసంచిక తరువాయి)

కురుసామ్రాజ్యంపై ధర్మబద్ధమైన, న్యాయ సమ్మతమైన హక్కు కౌరవులదా? లేక పాండవులదా? అనే విషయంలో లోకంలో అనేకమందికి అనేక సందేహాలున్నాయి. కేవలం పామరులలోనే కాదు పండితులలో కూడా అనేక భేదాభిప్రాయాలున్నాయి. అనేక విమర్శలు-ప్రతివిమర్శలు చేసుకున్నారు. కొందరు దుర్యోధనపక్షం వహించగా మరికొందరు ధర్మరాజుపక్షం వహించారు.

ధృతరాష్ట్ర పాండురాజులలో **పాండురాజే పట్టాభిషిక్తుడైన రాజు-** అని మూలభారతం చెబుతుండగా, **ధృతరాష్ట్రుడే పట్టాభిషిక్తుడైనట్లుగా** ఆంధ్రమహాభారతంలో నన్నయగారు వ్రాశారు. ఇలా ఎందుకున్నది? ఇందులో ఏది సరైనది? ఈ విషయం తేలాలంటే గ్రంథాన్ని ఆమూలాగ్రంగా అధ్యయనం చేయాలి. లోతుగా పరిశీలన చేయాలి. అంధుడు రాజ్య పట్టాభిషేకానికి అర్హుడు కాదు అని కొందరంటే, పాండురాజు పాండురోగి కదా! అతడెలా అర్హుడవుతాడు? అని మరికొందరి వాదన. మరి ఈ విషయంలో ధర్మశాస్త్రాలు ఏమి చెబుతున్నాయి?

**పాండురాజే పట్టాభిషిక్తుడైతే**, రాజ్యాధికారం ధర్మబద్ధంగా పాండవులదే కదా? అయినప్పుడు కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయంలో ఏ అధికారం లేని దుర్యోధనుడు కర్ణునికి అంగరాజ్యాన్ని ఎలా కట్టబెట్టాడు? హక్కులేని దుర్యోధనుడు అంగరాజ్యాన్ని ప్రదానం చేస్తుంటే హక్కున్న పాండవులెందుకు మౌనం వహించారు? భీష్మవిదురులేల అడ్డగించలేదు? కనీసం ద్రోణాచార్య కృపాచార్యులు తమ నిరసనను తెలియజేయ లేదేమి? అని కొందరు వాదిస్తుంటే-మరికొందరు **ధృతరాష్ట్రుడే పట్టాభిషిక్తుడైతే,** రాజ్యాధికారం ధర్మబద్ధంగా ఆతని కుమారుడు దుర్యోధనునిదే కదా! మరి భీమునిచంపి, ధర్మజార్జునులను బంధించి ఈ రాజ్యాన్ని ఏలుకోవాలనే దురాలోచనను దుర్యోధనుడెందుకు చేశాడు? తన కుమారుడు దుర్యోధనుడే ఉత్తరాధికారి అయినపుడు పాండవ జ్యేష్ఠుడైన ధర్మరాజు నెందుకు యువరాజుగా అభిషేకించాడు ధృతరాష్ట్రుడు? కుంతీ పాండవులను లక్క ఇంట తగులబెట్టాలని ఎందుకు ప్రయత్నించాడు దుర్యోధనుడు? అని కొందరు వాదిస్తున్నారు. ఈ వాదనలలో ఏది నిజం? ఈ వాదనలలో దాగి ఉన్న రహస్యాలేమిటి? ఇక **గాంధారీ గర్భతాడనం** చేసుకోవటంలో దాగి ఉన్న రహస్యమేమిటి? ఇలా ఎన్నో సందేహాలు, ఎంతో గజిబిజి, గందరగోళం లోకంలో వ్యాప్తిలో ఉన్నది.

ఇక ఎందరో పండితులు ఏదో ఒక పక్షం వహించి గ్రంథంలోని విషయాలను వ్యత్యస్తం చేసి, లేదా ఉన్న విషయాలకు మసిబూసి మారేడుకాయ చేసి ఏదోవిధంగా తమ వాదన నెగ్గించుకునేందుకు, తమ పక్షాన్ని గెలిపించు కొనేందుకు నానాతంటాలుపడుతున్నారు. సందట్లో సడేమియా లాగా హరికథలు, బుఱ్ఱకథలు, నాటకాలు, సినిమాలు-ఇవన్నీ కూడా చేతనైనంతవరకు గందరగోళాన్ని సృష్టించి వినోదిస్తు న్నాయి. మరి మన కర్తవ్యం?

మన స్వంతఅభిప్రాయాలను, అభిమాన దురభిమానా లను ప్రక్కనబెట్టి, మహాభారత గ్రంథం ఏమి చెబుతున్నదో చక్కగా గ్రహించి, లోతుగా పరిశీలన చేసి, కురుసామ్రాజ్యంపై హక్కు కౌరవులదో, పాండవులదో ధర్మనిర్ణయం చేద్దాం.

**(1) రాజ్యపట్టాభిషేక విషయం మూల (సంస్కృత) భారతంలో ఏమని ఉన్నది?**

**జ:** ధృతరాష్ట్ర, పాండురాజ, విదురులను భీష్ముడు పుత్రులలాగా ప్రేమతో పెంచుతున్నాడు. ముగ్గురూ వేదాధ్యయనం, వ్యాయామం, ఆటపాటలతో పెద్ద వారౌతున్నారు. ధనుర్వేదాన్ని, గుర్రపుస్వారీని, గదాయుద్ధాన్ని, నీతిశాస్త్రాన్ని, సకలవిద్యలను నేర్చుకున్నారు. ధనుర్వేదంలో పాండురాజు, శారీరకబలంలో ధృతరాష్ట్రుడు, ధర్మపరాయణతలో విదురుడు సర్వశ్రేష్టులయ్యారు. వీరపుత్రులను కన్నతల్లులలో కాశీ రాజపుత్రికలు అంబికా, అంబాలికలు; దేశాలన్నింటిలో కురుజాంగలదేశం; సంపూర్ణ ధర్మజ్ఞులలో భీష్ముడు; నగరాలన్నింటిలోను హస్తినాపురం సర్వశ్రేష్ఠమైనవని పౌరులందరూ తమలో తాము చెప్పుకుంటూ ఉన్నారు. (ఆది 108 అ.18-24శ్లో)

**శ్లో॥ ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వాద్ రాజ్యం నప్రత్యపద్యత।**
**పారశవత్వాద్ విదురో రాజాపాండుర్బభూవహ॥**

(ఆది 108అ.25శ్లో)

**తా॥** ధృతరాష్ట్రుడు అంధుడు గనుక రాజ్యాన్ని పొందలేక పోయాడు. విదురుడు పారశవుడు (బ్రాహ్మణునకు శూద్ర స్త్రీయందు జన్మించినవాడు) గనుక పాండురాజు రాజయ్యాడు.

ఇలా మూలభారతంలో స్పష్టంగా పేర్కొనటం వల్ల ***పాండురాజే కురుసామ్రాజ్యానికి రాజుగా పట్టాభిషిక్తుడయ్యాడని సందేహానికి తావు లేకుండా గ్రహించవచ్చు.***

**(2) ఏదైనా ప్రబలమైన కారణం ఉన్నప్పుడు జ్యేష్ఠుని వదలి కనిష్ఠుని రాజుగా చేసే ఆచారం ఈ చంద్రవంశంలో (కురువంశంలో) ఉన్నదా?**

**జ:** ఉన్నది. చంద్రవంశంలో 6వ రాజు **యయాతి.** ఆయనకు ఇద్దరు భార్యలు. శుక్రాచార్యుని కుమార్తె దేవయాని, వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ. యయాతికి దేవయానివల్ల యదు, తుర్వసులను ఇద్దరు కుమారులు. శర్మిష్ఠ వల్ల దృహి, అను, పూరులని ముగ్గురు కుమారులున్నారు. దేవయాని దురహంకారం వల్ల శుక్రాచార్యుడు యయాతిని "వృద్ధుడవై పోయెదవుగాక" అని శపించాడు.

యయాతి అనేక విధాల ప్రార్థించగా శుక్రాచార్యుడు శాపవిమోచన మార్గం చెప్పాడు. "నీ పుత్రులలో ఎవరైనా నీ వృద్ధాప్యాన్ని వారు తీసుకొని, వారి యౌవనాన్ని నీకు ఇవ్వవచ్చు. అలా నీవు కోరుకున్నంత కాలం యౌవన భోగాలు అనుభవించిన తర్వాత నీ వృద్ధాప్యాన్ని నీవు గ్రహించి, వారి యౌవనాన్ని వారికి ప్రసాదించవచ్చు" అని ఆ ఉపాయం.

యయాతి తన ఐదుగురు కుమారులను రావించి, విషయాన్ని చెప్పి, "మీలో ఎవరు మీ యౌవనాన్ని నాకు ఇచ్చి నా వృద్ధాప్యాన్ని కొంతకాలం అనుభవిస్తారో వారికే నా రాజ్యం వస్తుంది" అని చెప్పగా పెద్దవారు నలుగురూ అంగీకరించ లేదు. కనిష్ఠుడైన పూరుడే తండ్రి కోరిక ప్రకారం తన యౌవనాన్ని ఇచ్చి, వృద్ధాప్యాన్ని స్వీకరించాడు. కొంతకాలం తర్వాత యయాతి మహారాజు పూరుని రావించి, అతడి యౌవనాన్ని అతడికి ప్రసాదించి, తన వృద్ధాప్యాన్ని తాను స్వీకరించి, పూరుని రాజ్యసింహాసనారూఢుని గావించి, తాను భార్యలతో తపోవనానికి వెళ్ళిపోయాడు. ఈ విధంగా కనిష్ఠుడైన పూరుడే రాజయ్యాడు. ఇది ఒకటి.

చంద్రవంశంలో 38వ రాజు **ప్రతీపుడు.** ఆయనకు సునంద అనే భార్యవల్ల దేవాపి, శంతనుడు, బాహ్లికుడు అని ముగ్గురు కుమారులు. (ఆది.95అధ్యా.44శ్లో) వారిలో జ్యేష్ఠుడైన దేవాపి ధార్మికుడు, సత్యవాది, పితృశుశ్రూషా తత్పరుడు, పౌరజానపదులకు సమ్మతుడు, వదాన్యుడు, సకల శాస్త్రపండితుడు. అయితే అతడికి త్వగ్దోషం (చర్మవ్యాధి-బొల్లి) ఉన్నది. కొంతకాలానికి ప్రతీపుడు జ్యేష్ఠకుమారుడైన దేవాపికి పట్టాభిషేకము చేయ ప్రయత్నించగా 'శిష్టసభ' దేవాపిని రాజ్యాధిపతిగా అభిషేకింపరాదని నిర్ణయించినది.

శిష్టసభ అంటే రాజ్యాంగమును నిర్ణయించుటకు సకలశాస్త్ర కోవిదులై, సమత్వబుద్ధి కలిగిన ముగ్గురు పండితులతో కూడిన సభ. ప్రతీపుడు దుఃఖంతో "ఉత్తముడైన దేవాపిని మీరెందుకు నిషేధిస్తున్నారు?" అని అడుగగా ఆ శిష్టసభయందలి పండితులు "దేవాపి ఉత్తముడే అయినప్పటికీ త్వగ్దోషి (బొల్లి) అయినందున అట్టివానిని రాజ్యాధిపతిగా దేవతలంగీకరించరు, కనుక దేవాపిని విడిచి శంతనుని అభిషేకించుడు" అని సమాధానం చెప్పారు. అప్పుడు దేవాపి రాజ్యభ్రష్టుడనైతినేయని చింతించి, నిర్వేదంతో, సర్వసంగ పరిత్యాగం చేసి, తపస్సుకై అరణ్యాలకు వెళ్ళిపోయాడు. శంతనుడు రాజ్యపట్టాభిషిక్తుడయ్యాడు. ఇది జ్యేష్ఠుడు రాజు

కాక, కనిష్ఠుడు రాజైన రెండవ సందర్భం.

ఇక శంతనునికి గంగాదేవివల్ల జన్మించిన భీష్ముడు తన ప్రతిజ్ఞచేత రాజ్యాధికారాన్ని వదులుకొని సత్యవతీ పుత్రుడైన చిత్రాంగదుని రాజుగా అభిషేకించటం జరిగింది. ఇది మూడవ సంఘటన.

ఇపుడు అంధత్వం వల్ల ధృతరాష్ట్రుని కాదని పాండు రాజును అభిషేకించుట నాలుగవ సంఘటన. కనుక ప్రబలమైన కారణం ఉన్నప్పుడు జ్యేష్ఠుని వదిలి కనిష్ఠుని రాజుగా చేయటం చంద్రవంశంలో కొత్త విషయమేమీ కాదు.

**(3) ధృతరాష్ట్రుడు అంధుడు గనుక రాజ్యాభిషేకానికి అనర్హుడని అప్పటికప్పుడు భీష్ముడు నిర్ణయించుకొని పాండురాజును రాజుగా చేశాడా? లేక ముందునుంచే ఉన్న నిర్ణయమా?**

**జ:** ధృతరాష్ట్రుడు పుట్టకముందే - అంటే వ్యాసుని ద్వారా అంబిక గర్భమునందు నిక్షిప్తము చేయబడినప్పుడే అతడు రాజ్యాభిషేకానికి అనర్హుడని నిర్ణయించబడినది. ఎలా?

సత్యవతీదేవి నియోగంతో వ్యాసుడు అంబికకు పుత్రదానం చేశాడు. ఆ సమయంలో పుట్టబోవు పుత్రుని గూర్చి సత్యవతి వ్యాసుని అభిప్రాయము కోరగా వ్యాసుడు, మాతృదోషం వల్ల అంబిక గర్భమునందు జాత్యంధుడు (పుట్టు గ్రుడ్డి) పుట్టునని తెలియజేశాడు. అపుడు సత్యవతీదేవి-

**"నాంధఃకురుణాం నృపతి రనురూపస్తపోధన।**
**జ్ఞాతి వంశస్య గోప్తారం పితౄణాం వంశవర్ధనం॥**

**(ఆది. 105అ-11శ్లో)**

**ద్వితీయం కురువంశస్య రాజానం దాతుమర్హసి।**
**సతథేతి ప్రతిజ్ఞాయ నిశ్చక్రామ మహాయశాః॥**

**(ఆది105అ. 12శ్లో)**

**తా॥** తపోధనా! అంధుడు కురువంశపు రాజు కాదగడు గదా! అందువల్ల రాజ్యానికి అర్హుడై జ్ఞాతులను, సమస్త కులాన్ని రక్షించేవాడు, తండ్రి వంశాన్ని వృద్ధిచేసేవాడు కాగల మరియొక పుత్రుని ఈ కురువంశం కోసం ప్రసాదించు- అనగా 'అలాగే' అని చెప్పి మహాయశస్వి వ్యాసభగవానుడు అక్కడినుండి వెళ్ళిపోయాడు.

దీనినిబట్టి అంధుడు రాజ్యానికి అనర్హుడు అనే విషయం సత్యవతికి తెలుసు. తెలుసు గనుకనే రాజ్యానికి అర్హుడయ్యే ఉత్తముడైన మరొకపుత్రుని ప్రసాదించమని కోరింది. అంధుడు రాజ్యానికి అనర్హుడని తెలుసు గనుకనే వ్యాసుడు సత్యవతీదేవి మాటను అంగీకరించాడు. లేనిచో అంధుడైననేమి? రాజ్యానికి అర్హుడేనని చెప్పేవాడుగదా! గనుక అంధుడు రాజ్యానర్హుడనే విషయం ఆనాటి పెద్దలందరికీ తెలిసిన విషయమే. అందుకే ధృతరాష్ట్రుడు పుట్టకముందే అంధుడౌతాడని తెలియటంతోనే అతడు రాజ్యానర్హుడని సత్యవతి నిర్ణయించటం జరిగింది. రాజ్యానికి అర్హుడు కాగల మరియొక పుత్రుని అంబాలికకు ప్రసాదించమని వ్యాసుని కోరింది. అంబాలికకు జన్మించిన పాండురాజు రాజయ్యాడు.

**(4) పాండురాజు పాండురోగికదా? అతడెట్లు రాజ్యార్హుడవుతాడు?**

పాండురోగియైన పాండురాజుకు కూడా రాజ్యార్హత లేదని నిరూపిస్తూ, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి గారు తమ 'దాయ భాగవినిర్ణయము' అనే విమర్శక గ్రంథంలో ఇలా తెలియజేశారు. "గ్రుడ్డివాడను కారణమున ధృతరాష్ట్రునకు రాజ్యము రాకపోయినచో, పాండురోగియను కారణమున పాండురాజుకు కూడా రాజ్యము చెందలేదని చెప్పవచ్చును. **పాండురాజు రాజ్యార్హుడే అయితే వేదవ్యాసుని నియోగముచే విచిత్రవీర్య క్షేత్రమునందు ఇంకనొక (3వ) పుత్రుని పుట్టింప కోరనేల?** మొదటిపుత్రుడు అనర్హుడని రెండవవానిని కోరింది సత్యవతి. రెండవవాడు కూడా అనర్హుడు కనుకనే మూడవ వానిని కోరింది. **ఏకముత్పాదయేత్ పుత్రం నద్వితీయం కథంచన** (నియోగవిధిలో ఒక్క పుత్రునే ప్రసాదించాలి. రెండవ వానికై ప్రయత్నించరాదు) అని నొక్కి చెప్పబడియున్నది. ధర్మమిట్లుండగా తలచిన కార్యం నెరవేరినపుడు మరల నియోగించుట ఉచితమా? వ్యాసుడంగీకరించునా? కావున పాండువు కూడా రాజ్యార్హుడు కాడు. ఈ **పాండుతయనునది బొల్లికాదు, కుష్ఠరోగమే.** ఇది బ్రహ్మయ్యశాస్త్రులు గారి వాదం.

బ్రహ్మయ్యశాస్త్రులు గారి వాదనలోని దోషాన్ని ఎత్తి చూపలేక మరొక పండితుడు శిష్ట్లా సూర్యనారాయణశాస్త్రి గారు తమ "మహాభారత రహస్యము" అనే గ్రంథంలో ఇలా తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. "ప్రప్రథమమున అంబిక యందు జాత్యంధుడు జన్మించినతోడనే సత్యవతి అతనికి రాజ్యార్హతలేమికి చింతించి, వ్యాసునితో "అంధుడు రాజ్య

మేలుటకు అవకాశము లేదు గాన కురువంశమునకు రాజు కాదగిన కుమారుని ప్రసాదింపుమ"ని చెప్పి, అతని కడకు అంబాలికను పంపగా ఆమెయందు పాండురూపి జన్మించెను.

అపుడు సత్యవతి పూర్వము శిష్టసభ దేవాపిని నిషేధించినట్లే పాండురాజును గూడా నిషేధించునని శంకించి మరియొక కుమారుని ప్రసాదింపుమని తిరిగి వ్యాసుని కోరెను. కాని ఆ ప్రయత్నము కూడా విఫలమయ్యెను. అయితే ఇచట జాత్యంధుని వలెనే వివర్ణుడు కూడా రాజ్యాభిషేకమునకు తగడు గదా! అటువంటివానికి పట్టాభిషేకమెట్లు చేసెనందురా? రాజ్యాభిషేకమునకు తగడనుట నిశ్చయమే గాని, అభావము నందిరువురిలో ఉత్తముడనే హేతువుచే అతని నభిషేకించెను. అచ్చట తగిన కుమారుడు మరియొకడున్నచో పాండురాజును కూడా పరిత్యజించియేయుండును. కాని తరువాత జన్మించిన విదురుడు దాసీపుత్రుడు గనుక పాండు రాజుకే రాజ్యమిచ్చెను" ఇది శిష్లా సూర్యనారాయణశాస్త్రి గారి సమర్థింపు.

జ: ఇలాంటి పండితుల వ్రాతలమూలంగానే మహాభారత గ్రంథాన్ని స్వయంగా అధ్యయనం చేయని ఎంతోమంది, పాండురాజు పాండురోగియని భావిస్తారు. బొల్లియని కొందరు, కుష్ఠయని కొందరు తమ నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఉంటారు. అంతటి గొప్పగొప్ప పండితులు చెప్పేదానికన్నా మనకు ఎక్కువ తెలుసా? అని తమ అశక్తతను బయటపెట్టుకుంటారు. అయితే ఈ సందర్భంలో గ్రంథంలో ఏమున్నదో పరిశీలన చేద్దాం.

ధృతరాష్ట్ర, పాండు, విదురుల జనన సంబంధ విషయాలన్నీ మూలభారతంలో ఆదిపర్వం 105వ అధ్యాయంలో ఉన్నవి. ఆ అధ్యాయంలో ఏమున్నదో చూద్దాం.

సత్యవతీదేవి నియోగంతో వ్యాసుడు అంబికకు పుత్రదానం చేసి, బయటకు రాగానే సత్యవతి వ్యాసునితో 'కుమారా! అంబిక గర్భంనుండి గుణవంతుడైన రాజకుమారుడు జన్మిస్తాడా?" అని అడిగింది.

దానికి వ్యాసుడు, "తల్లీ! పదివేల ఏనుగుల బలం గలవాడు, విద్వాంసుడు, రాజర్షులలో శ్రేష్ఠుడు, సౌభాగ్యశీలి, మహాపరాక్రమవంతుడు అయిన పుత్రుడు పుడతాడు. కాని మాతృదోషం చేత అతడు పుట్టంధుడౌతాడు" అన్నాడు.

అప్పుడు సత్యవతి "నాయనా! అంధుడు కురువంశపు రాజు కాదగడు గదా! అందువల్ల రాజై జ్ఞాతులను, సమస్త కులాన్ని రక్షించేవాడు కాగల మరియొక పుత్రుని ఈ కురువంశం కోసం ప్రసాదించు" అనగా, 'అలాగే' అని చెప్పి వెళ్ళిపోయాడు వ్యాసభగవానుడు. (6-12శ్లో)

ప్రేమ ఎక్కడ ఉన్నదో, అక్కడ హింస ఉండదు.
ప్రేమ ఎక్కడ ఉన్నదో, అక్కడ అశాంతి ఉండటానికి వీలులేదు.
ప్రేమ ఎక్కడ ఉన్నదో, అక్కడ అసత్యం చేరదు.

నవమాసాలు నిండిన తర్వాత అంబిక అంధుడైన పుత్రుని ప్రసవించింది. అంతట సత్యవతి అంబాలికను అంగీకరింపజేసి, శయ్యామందిరంలో కూర్చోబెట్టి, వ్యాసుని స్మరించింది. వ్యాసుడు వచ్చి నియోగవిధి ననుసరించి అంబాలికతో సంగమించాడు. అంబాలిక వ్యాసుని చూచి తెల్లబోయింది. సమాగమసమయంలో పాలిపోయిన ముఖంతో ఉన్నది. అపుడు వ్యాసుడు అంబాలికతో-

**శ్లో॥యస్మాత్ పాండుత్వమాపన్నా విరూపం ప్రేక్ష్యమామిహ।**
**తస్మాదేష సుతస్తే వై పాండురేవ భవిష్యతి॥ (17)**

**తా॥** "నీవు నన్ను చూచి వివర్ణురాలివయ్యావు కనుక నీకు పుట్టబోయే బిడ్డ **పాండువర్ణదేహంతో ఉంటాడు.** అందరూ అతణ్ణి పాండు అనే పిలుస్తారు" అని చెప్పి వెలుపలికి రాగా -

**శ్లో॥ తతో నిష్క్రాంత మాలోక్య సత్యా పుత్రమథాబ్రవీత్।**
**శశంసస పునర్మాత్రే తస్య బాలస్య పాండుతాం॥ (19)**

**తా॥** మందిరం నుండి వ్యాసుడు వెలుపలికి రాగా సత్యవతి పుట్టబోయే బిడ్డ గురించి వ్యాసుని అడిగింది. అపుడు వ్యాసుడు తల్లితో పుట్టబోయే బిడ్డ **పాండువర్ణదేహంతో ఉంటాడని తెలియజేశాడు.**

**శ్లో॥ తం మాతా పునరేవాన్య మేకం పుత్ర మయాచత।**
**తథేతిచ మహర్షిస్తాం మాతరం ప్రత్యభాషత॥ (20)**

**తా॥** అంతట సత్యవతి తిరిగి మరొక పుత్రునికొరకై అర్థించింది. మహర్షి అలాగే అని చెప్పి తల్లి యొక్క అనుజ్ఞను తీసుకొని వెళ్ళిపోయాడు.

ఇది ఆదిపర్వం 105వ అధ్యాయంలో 6 నుండి 20 శ్లోకాల వరకు గల గ్రంథం. దీనిని బట్టి పాండురాజు పాండు వర్ణ దేహం గలవాడని ఉన్నదే గాని పాండురోగియని ఎక్కడా

లేదు. అది బొల్లి లేదా కుష్ఠు అని ఎక్కడా లేదు. ఆంధ్ర మహాభారతంలో నన్నయ గారు ఈ శ్లోకాలను ఆంధ్రీకరించటంలో "యీ యంబాలికయందు మహాబల పరాక్రమ గుణవంతుడు, వంశకరుండునగు పుత్రుండు పుట్టి, వాడును మాతృదోషంబున **'పాండుదేహుండగు'**నని చెప్పి యరిగిన...." అనియే ఉన్నది. దీనినిబట్టి పాండుత్వం దేహకాంతి విశేషమేగాని, రాజ్యార్హతకు ప్రతిబంధకమైన రోగం కాదు అని స్పష్టం.

పాండురోగియని విమర్శకులచే చెప్పబడుతున్న ఈ పాండురాజునే కుంతీదేవి **స్వయంవరం**లో రాజసమూహం మధ్యలో సూర్యసమతేజంతో ప్రకాశిస్తున్నాడని తలంచి, వరించి వరమాలను వేసింది. (ఆది 111అ. 4-5శ్లో)

ఈ పాండురాజే వివాహానంతరం 30 రోజులు భార్యలతో గడిపి, పెద్దల అనుమతితో దిగ్విజయయాత్రకు బయలుదేరి, తూర్పున దశార్ణదేశరాజును, ఆ తర్వాత మగధ దేశాధీశుని, కాశీ, సుహ్మ, పుండ్ర మొదలైన అనేక దేశాల రాజులను జయించి అపార ధనరాసులను, చిత్రవిచిత్ర వస్తువులను, బహుమతులను తెచ్చి భీష్మ, ధృతరాష్ట్రులకు, తల్లులకు, సత్యవతీదేవికి సమర్పించాడు. ఆ తరువాత పాండురాజు తన పరాక్రమం చేత దిగ్విజయయాత్రలు గావించి ధృతరాష్ట్రునిచే 100 అశ్వమేథ యాగాలను చేయించి, ప్రతి యాగంలోను భూరిదక్షిణలను ఇప్పించాడు (ఆది 112-113అ). ఇట్టి పాండురాజుకు కుష్ఠురోగాన్ని అంటగట్టిన పండితుల విజ్ఞత ఏపాటిదో గ్రహించాలి. **కనుక పాండురాజు పాండురోగి కాదు అని తేలింది.**

"మొదటి పుత్రుడు అంధుడు గనుక అతడు రాజ్యానర్హుడని రెండవవానిని కోరింది సత్యవతి. మరి రెండవ పుత్రుని కూడా అనర్హుడనే గదా మూడవవానిని కోరింది? పాండురాజు రాజ్యార్హుడే ఐతే మరొక పుత్రుని కోరవలసిన అవసర మేమున్నది సత్యవతికి?" ఈ విమర్శలోని నిజానిజా లేమిటో పరిశీలిద్దాం.

**జ:** 'అంబికకు జన్మించబోయే పుత్రుడు మాతృదోషం చేత అంధుడౌతాడని' వ్యాసుడు సత్యవతీదేవితో చెప్పినప్పుడు "నాంధ:కురూణాం..." అంధుడు కురురాజు కాదగడు గదా! అందువల్ల రాజుకాగల మరియొకపుత్రుని ప్రసాదించమని అడిగింది సత్యవతి. రెండవ పర్యాయం నియోగవిధి ననుసరించి అంబాలికతో సంగమించి శయ్యాగృహం నుండి వెలుపలకు వచ్చిన వ్యాసునితో, సత్యవతి పుట్టబోయే బిడ్డ గురించి అడుగగా, మాతృదోషం చేత అతడు పాండువర్ణ దేహంతో ఉంటాడని వ్యాసుడు తెలియజేశాడు. అంతట సత్యవతి తిరిగి మరొకపుత్రునికై అర్థించింది. ఇదీ గ్రంథ విషయం. ఇందులో సత్యవతి మొదటి పుత్రుని విషయంలో అంధుడు కురురాజు కాదగడు గదా! **అన్నట్లు పాండురోగి కూడా రాజ్యార్హుడు కాదు గదా!** అని అనలేదు. పాండువర్ణ దేహుడనియే వ్యాసుడు చెప్పాడు. పాండురోగియనిగాని, బొల్లి, కుష్ఠు అని గాని వ్యాసుడుచెప్పలేదు. సత్యవతి అలాగని అనుకోలేదు. అలాగే అంధుడులాగా పాండువర్ణదేహంతో ఉన్నవాడు రాజ్యానికి తగడు అని సత్యవతి అనలేదు. ఏ శాస్త్రాలు చెప్పలేదు. **కనుక మూడవవానిని కోరటంలో ఉద్దేశం రెండవవాడు రాజ్యానికి అనర్హుడని భావించినందువల్ల కాదు అని స్పష్టం.** దీనితో పాండురాజు రాజ్యానర్హుడు కాదు అనే విషయం నిర్వివాదం. పాండురాజులో రాజ్యానర్హత లేదు గనుకనే భీష్ముడాతనిని పట్టాభిషిక్తుని చేశాడు.

**అయితే 3వ వానిని ఎందుకు కోరింది సత్యవతి?** అనే విషయం తేలాలి.

పాండురాజువల్ల కురువంశ పరంపర కొనసాగుతుంది? ఇక ఆ విషయంలో విచారించవలసినదేమీ లేదు. కాని అంబికకు పుట్టంధుడు జన్మించాడు. అంబాలిక పుత్రుడు అందంగా ఉంటాడు. అక్కచెల్లెళ్ళిద్దరూ తమ తమ బిడ్డలను పెంచి పెద్ద చేసేటప్పుడు అంబిక తన అంధపుత్రుణ్ణి చూచి తన దురదృష్టానికి దుఃఖిస్తుంది. అందువల్ల ఆమెకు కూడా ఒక అందమైన, దోషరహితుడైన బిడ్డ పుడితే మంచిది గదా! అనియే సత్యవతి ఆలోచించి 3వ వాని కొరకు ప్రార్థించింది. ఇదే విషయాన్ని తెలుగుభారతం కూడా సమర్థిస్తున్నది. ఈ చోట తెలుగుభారతంలో ఏమున్నదో చూడండి.

**"అంత నాంబికేయు జాత్యంధుం జూచి దుఃఖితయయి సత్యవతి వెండియు బారాశర్యుం దలంచుడు నాక్షణంబ నమ్ముని వరుండు వచ్చి పనియేమియన్న నీ యంబికకు ప్రథమ పుత్రుడంధుడయ్యె, నింకొక్కకొడుకు రూపవంతుం బడయు మనిన"**

దీనినిబట్టి పాండురాజు పాండుత్వము కలవాడగునని వ్యాసుడు చెప్పినప్పుడు అతనిని గూర్చి కూడ కురురాజు

కాదగడని అన్నట్లుగాని, దుఃఖించినట్లుగాని లేదు. పైగా అంబికకు ప్రథమపుత్రుడు అంధుడయ్యాడు గనుక ఆమెకు రూపవంతు డైన మరియొక పుత్రునిమ్మని మాత్రమే కోరింది సత్యవతి.

కనుక బ్రహ్మయ్యశాస్త్రులు గారన్నట్లు రెండవ పుత్రుని కోరింది గనుక మొదటి పుత్రుడు అనర్హుడైనట్లే మూడవవానిని కోరింది గనుక రెండవ పుత్రుడు కూడా అనర్హుడే అనే విమర్శ తప్పు. అలాగే సూర్యనారాయణశాస్త్రి గారికి ఉన్నట్లుగా సత్యవతికి పాండురాజును గూర్చి ఏ సందేహమూ లేదు. దేవాపిని నిషేధించినట్లే పాండురాజును నిషేధిస్తారనే శంక సత్యవతికి లేనే లేదు. అలా ఉంటే ఆ విషయం స్పష్టంగా ఆమెయే చెప్పేది. కనుక ఇరువురి విమర్శలూ అసంబద్ధమే.

ఇక 'మహాభారత రహస్య' గ్రంథకర్త శిష్లా సూర్య నారాయణశాస్త్రి గారు పాండురాజ పట్టాభిషేకాన్ని సమర్థించ టానికే అయినా, ఏదేదో ఊహించుకొని, చాలా శ్రమపడి అడ్డదిడ్డంగా వాదించి ఋజువుచేసే ప్రయత్నం చేశారు.

"పాండురాజు రాజ్యాభిషేకానికి తగడనుట నిశ్చయమే గాని, అభావమునందిరువురిలో ఉత్తముడనే హేతువుచే పాండురాజును అభిషేకించాడు భీష్ముడు". ఇదీ ఆయన కనిపెట్టిన రహస్యం. మనం వెలిబుచ్చే అభిప్రాయాలుగాని, చేసే విమర్శలు గాని గ్రంథానికి అనుగుణంగా ఉండాలే తప్ప మన పుర్రెలో పుట్టినబుద్ధిని బట్టి గాదు. **పాండురాజు రాజ్యాభిషేకానికి తగడనుట నిశ్చయమేనట. ఎవరు నిశ్చయించారు అలాగని?** సత్యవతియా? వేదవ్యాసుడా? భీష్ముడా? శాస్త్రాలా? శిష్టఋషియా? ఎవ్వరూ అలా నిశ్చయించలేదు. అలా నిశ్చయించి నట్లు మహాభారతంలో ఎవ్వరూ చెప్పలేదు. ఎవ్వరూ అనని, చెప్పని, నిశ్చయించని విషయాన్ని మనమే అనుకొని నిశ్చయించటమేనా? గ్రంథంలో ఎక్కడన్నా ఉన్నదా? లేదా? అని చూడనక్కరలేదా?

**అభావమునందిరువురిలో పాండురాజు ఉత్తముడట.** అందువల్ల పాండురాజును పట్టాభిషిక్తుని చేశాడట భీష్ముడు.

> **'ఎక్కడ ధర్మము ఉంటే అక్కడే విజయము'. ఎక్కడ కృష్ణుడు ఉంటే-అక్కడే జయము. ధర్మానికి అపజయం లేదు. దేవుడున్నచోట విజయానికి లోటు రాదు.**

అంటే ఇద్దరు అనర్హులలో కొంతవరకు పాండురాజే ఉత్తముడని (తక్కువదోషం ఉన్నవాడని) గత్యంతరం లేక భీష్ముడు పాండురాజును పట్టాభిషిక్తుని చేశాడట. మరొకడు అర్హత ఉన్నవాడు ఉన్నట్లైతే అతణ్ణే అభిషిక్తుని చేసేవాడట. ఇదే నిజమైతే పట్టాభిషేక సమయంలో భీష్ముడెందుకు ఆ మాట చెప్పలేదు? భీష్ముని మనస్సులో అలాంటి భావన ఉన్నదని ఈ శాస్త్రిగారికెవరు చెప్పారు? మహాభారత గ్రంథంలో ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరైనా ఈ మాటను చెప్పారా? లేదే? గ్రంథంలో ఎక్కడాలేని విషయాన్ని గ్రంథ విరుద్ధంగా ఊహించి వ్రాయటమేనా వీరిపని? ఇదేనా వీరి పరిశోధన?- తేలిన విషయం ఏమంటే-పాండురాజు పాండురోగి కాదు, పాండువర్ణదేహుడే. శరీరం యొక్క రంగు రాజ్యాభిషేకానికి అనర్హత కాదు. ధృతరాష్ట్రుడు అంధుడు గనుక రాజ్యానర్హుడు. కనుకనే భీష్ముడు కురుసామ్రాజ్యానికి పాండురాజును పట్టాభిషిక్తుని చేశాడు. శాస్త్రాలలో అంధుడు రాజ్యానర్హుడని ఉన్నదేగాని పాండుత్వం అనర్హతగా చెప్పబడ లేదు.

-అంధుడు రాజ్యానర్హుడని ఏ శాస్త్రాలు చెబుతున్నాయి? ఒకవేళ అంధుడైనందున ధృతరాష్ట్రుడు రాజ్యానికి అనర్హుడైతే ఆ ధృతరాష్ట్రుడే పాండురాజు వనాలకు వెళ్ళిన తర్వాత ఎలా రాజయ్యాడు? పాండురాజ మరణానంతరం నుండి కురుక్షేత్ర సంగ్రామం వరకు దాదాపు ఏనభై సంవత్సరాలు ధృతరాష్ట్రుడు రాజ్య సింహాసనాన్ని ఎలా అధిష్ఠించాడు? అప్పటికి అంధత్వం పోలేదు గదా! అసలు ఆంధ్రమహాభారతంలో 'ధృతరాష్ట్రుడే రాజ్యపట్టాభిక్తుడ'ని నన్నయగారు వ్రాశారు గదా! దాని మాటేమిటి ఈ ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం ఏమిటి?


**(వచ్చే సంచికలో)**




**ఉప్పువలన బి.పి., గుండెజబ్బులు వస్తాయి. ఉప్పు పూర్తిగా మానితే మంచిది. కూరలలో మానలేకపోతే కనీసం పెరుగన్నం, మజ్జిగ, నిమ్మరసం నీళ్ళు, జామకాయలు, మొక్కజొన్న పొత్తులు మొదలగువాటితో ఉప్పు మానాలి.**

# మహాభారతం

## కురుసామ్రాజ్యాధిపత్య నిర్ణయము 12




రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716


(గతసంచిక తరువాయి)

**5) అంధుడు రాజ్యాభిషేకానికి అనర్హుడని ఏ శాస్త్రాలు చెబుతున్నాయి?**

జ: అంధునకు రాజ్యార్హత లేదనే విషయాన్ని మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి తెలియజేస్తున్నాయి.

**శ్లో॥ అనంశౌ క్లీబ పతితౌ జాత్యంధ బధిరౌ తథా।**
**ఉన్మత్త జడ మూకాశ్చ యేచకేచిన్నిరింద్రియా॥**

**(మనుస్మృతి 9 అధ్యా)**

**తా॥** నపుంసకునికి, పతితునికి, జాత్యంధునికి, చెవిటివానికి, పిచ్చివానికి, జడునికి, మూగవానికి, కుంటి మొదలైన అంగవికలురకు రాజ్యమునందు అధికారము లేదు.

కనుక మనుధర్మశాస్త్రం జాత్యంధునికి రాజ్యార్హత లేదని స్పష్టం చేస్తున్నది. ఇక –

**శ్లో॥ క్లీబోఽథ పతితస్తజ్జః పంగురున్మత్తకో జడః ।**
**అంధో చికిత్స్య రోగాద్యా భర్తవ్యాస్స్యుర్నిరంశకాః ॥**

**(యాజ్ఞవల్క్యస్మృతి)**

**తా॥** నపుసంకునికి, పతితునికి, కుంటివానికి, పిచ్చివానికి, జడునికి, అంధునికి, చికిత్సలేని రోగం (జబ్బు) ఉన్నవానికి రాజ్యార్హత లేదు.

"యాజ్ఞవల్క్యస్మృతి కూడా అంధునికి రాజ్యార్హత లేదని స్పష్టం చేస్తున్నది.

కనుక జాత్యంధుడైన ధృతరాష్ట్రునికి రాజ్యార్హతలేదని మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి మొదలైన ధర్మశాస్త్రాలు స్పష్టం చేస్తున్నాయి.

**6) అంధుడైన ధృతరాష్ట్రుడు రాజ్యానికి అనర్హుడైతే పాండురాజు భార్యలతో కలిసి వనాలకు వెళ్ళిన తర్వాత ఈ అంధుడే ఎలా రాజయ్యాడు? అప్పటికి అంధత్వం పోలేదు గదా!**

ఈ విమర్శను కూడా తమ 'దాయభాగవినిర్ణయము'లో కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రులు గారే ఇలా వ్యక్తం చేశారు. "గ్రుడ్డివాడు బొత్తుగా రాజ్యార్హుడు కాదని చెప్పుకొందుమేని మొదటికే మోసము వచ్చును. ఏమన- పాండురాజానంతరమునవైన రాజ్యము స్వీకరించెను గదా! మొదట పనికిరాని వాడు ఇప్పుడెలా పనికివచ్చినాడు?" అని.

జ: రాజ్యాభిషేకం అనేది ఒక శాస్త్రీయ సంస్కారం. పట్టాభిషేకపూర్వకంగా రాజ్యాన్ని గ్రహించటానికి, రాజ్యాధిపత్యం వహించటానికి శాస్త్రనియమానుసారం అంధుడు పనికిరాడు. అంతేగాని రాజులేని సమయంలో ఆపద్ధర్మంగా సింహాసనాన్ని అధిష్ఠించటానికి, రాజకార్య వ్యవహారాలను చూడటానికి అంధత్వదోషం అడ్డురాదు, అందువల్లనే పాండురాజు వనములకు వెళుతూ ధృతరాష్ట్రునకు, విదురునకు రాజ్యమును ఒప్పగించి భార్యలతో కలసి వెళ్ళటం జరిగింది. ఈ విషయాన్ని రాయబార సభలో దుర్యోధనునితో ద్రోణాచార్యుడిలా చెప్పటం జరిగింది.

**శ్లో॥ తతః సింహాసనే రాజన్ స్థాపయిత్వైన మచ్యుతం ।**
**వనం జగామ కౌరవ్యో భార్యాభ్యాం సహితో నృపః॥**

**(ఉద్యో 148 అ.5శ్లో)**

**శ్లో॥ నీచై స్థిత్వాతు విదుర ఉపాస్తేస్మ వినీతవత్ ।**
**ప్రేష్యవత్ పురుష వ్యాఘ్రో వాలవ్యజనముత్ క్షిపన్॥**

**(ఉద్యో 148 అ.6శ్లో)**

**శ్లో॥ తతః సర్వాః ప్రజాస్తాత ధృతరాష్ట్రం జనేశ్వరం ।**
**అన్వపద్యంత విధివత్ యథా పాండుం జనాధిపం ॥**

**(ఉద్యో 148 అ.7శ్లో)**

**శ్లో॥ విసృజ్య ధృతరాష్ట్రాయ రాజ్యం సవిదురాయచ॥**
**చచార పృథివీం పాండు సర్వాం పరపురంజయ ॥**

**(ఉద్యో 148 అ.8శ్లో)**

తా॥ దుర్యోధనా! పాండురాజు నీ తండ్రి ధృతరాష్ట్రుని సింహాసనంపై కూర్చుండబెట్టి తన భార్యలిద్దరితో కలసి వనాలకు బయలుదేరాడు. (5) ఆ తర్వాత విదురుడు ఒక సేవకునివలె ధృతరాష్ట్రునికి అత్యంత విధేయుడై సేవలందిస్తూ ఉన్నాడు. (6) తరువాత ప్రజలందరూ పాండురాజును అనుసరించినట్లే నీ తండ్రి ధృతరాష్ట్రుని అనుసరిస్తూ ఉన్నారు. (7) ఈ విధంగా శత్రుంజయుడైన పాండురాజు విదురునితో కూడా ధృతరాష్ట్రునకు రాజ్యాన్ని విడిచిపెట్టి పృథివియందంతట సంచరించాడు. (8)

దీనినిబట్టి అంధుడు పట్టాభిషేకానికి అర్హుడు కాదుగాని, రాజ్యపాలనా వ్యవహారాలను నిర్వహించటానికి ఏ అభ్యంతరము లేదు. అందువల్లనే పాండురాజుచేత నియోగించ బడి సింహాసనం అధిష్ఠించాడు. పాండురాజు మరణానంతరం కూడా పట్టాభిషేకం లేకుండానే రాజ్యపాలన గావించాడు ధృతరాష్ట్రుడు. ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తుడైనట్లు గ్రంథంలో ఎక్కడాలేదు.

పట్టాభిషిక్తుడయ్యే రాజు ఎందుకు హీనాంగుడు కారాదో ధృతరాష్ట్రుడే స్వయంగా దుర్యోధనునితో దేవాపి విషయమై రాయబార సభలో తెలియజేశాడు.

**శ్లో॥ హీనాంగం పృథివీపాలం నాఽభినందంతి దేవతాః**
**ఇతి కృత్వానృపశ్రేష్ఠం ప్రత్యషేధన్ ద్విజర్షభాః ॥**
**(ఉద్యో 149 అ.25శ్లో)**

**తా॥** హీనాంగుడైనవాడు రాజ్యాభిషిక్తుడైతే దేవతలు అభినందించరు. అందువల్లనే ఆ రాజశ్రేష్ఠుని (దేవాపి) రాజ్యాభిషేకమును శిష్టసభ నిషేధించినది.

ఈ ధృతరాష్ట్ర వాక్యంవల్ల పట్టాభిషిక్తుడయ్యేరాజు అంధుడు- హీనాంగుడు కారాదని, అలా హీనాంగుని పట్టాభిషేకిస్తే దేవతలు అనుగ్రహించరని, దేవతల అనుగ్రహానికి పాత్రుడు కానిచో రాజ్యంలో దుర్భిక్షాదిదోషాలు సంభవిస్తాయని, అవి సంభవిస్తే ప్రజలు ఆహారధాన్యాలు లేక ఆకలితో అలమటించిపోతారని, దానితో రాజుపట్ల వ్యతిరేకు లౌతారని, ధర్మబద్ధులై, రాజానువర్తనులై చరించరని, దానివల్ల కల్లోలము కలుగునని గ్రహించాలి. ఈ కారణం చేతనే ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తుడు కాలేదు. పాండురాజ నియోగంతో, విదురుని సహాయంతో రాజకార్య వ్యవహారాలను సాగిస్తూ వచ్చాడు.

కనుక బ్రహ్మయ్యశాస్త్రులుగారన్నట్లు ధృతరాష్ట్రుడు పాండురాజానంతరం పరిపాలన చేసినందున మొదటికీ మోసం రాలేదు; చివరికీ మోసం రాలేదు.

(7) ఆంధ్రభారతములో ధృతరాష్ట్రుడే రాజ్యాభిషిక్తుడైనట్లుగ ఉన్నది గదా! మూలాన్ని బట్టేగదా తెలుగుభారతం! మరి ఎందుకలా నన్నయగారు తెనిగించారు?

జ: నిజమే! తెలుగు భారతంలో నన్నయ్యగారు స్పష్టంగా ధృతరాష్ట్రుడే రాజ్యాభిషిక్తుడని వ్రాశారు. ఆదిపర్వం పంచమాశ్వాసంలో ఇలా ఉంది-

**"ఇట్లు బ్రహ్మోత్తరంగా ప్రజావృద్ధియు, సస్యసమృద్ధియు నగుచుండ నాంబికేయు ధృతరాష్ట్రు రాజ్యాభిషిక్తుం జేసి, భీష్ముండు దనదు విల్లును, విదురుబుద్ధియును సహాయంబులుగా రాజ్యంబురక్షించుచున్నంత"**-అని. ఇది పంచమాశ్వాసం లోనిది.

ఐతే ధృతరాష్ట్రుడు రాజ్యాభిషిక్తుడని పంచమాశ్వాసంలో వ్రాసిన నన్నయ్యగారే ఆ తర్వాత వచ్చే షష్ఠాశ్వాసంలో ఏమి వ్రాశారో చూద్దాం- "కుమారాస్త్ర విద్యా ప్రదర్శనానంతరం ఒక సంవత్సరం తర్వాత ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరుని రాజ్యభార దురంధరునిగా ఎఱింగి, భీష్మవిదురులతో విచారించి యౌవరాజ్యాభిషిక్తుని చేసెను. ఆ తరువాత పాండవులు తమ పరాక్రమముతో దిగ్విజయయాత్రలు గావించుచుండిరి. అప్పుడు దుర్యోధనుడు, కర్ణ, శకుని, దుశ్శాసనులతో - 'ధర్మజుని యౌవరాజ్యాభిషిక్తుని చేసినందులకు, భీమార్జునుల పరాక్రమమునకు సహింపక' మంతనములాడుచుండెను. "రణశూరులు, ఆయుధవిద్యలందు నేర్పరులైనవారినిప్పుడు ధర్మజుని యువరాజుగ జేయ నేనేమి చేయగలవాడన"ని కణికుడను శకుని మంత్రిని అడుగగా, అతడు 'అపకారులైన వారిని పరులైనను, బంధువులైనను దూరముగా ఉంచి తుద ముట్టించవలయున'ని చెప్పెను.

అంత ఒకనాడు దుర్యోధనుడు తండ్రివద్దకు వెళ్ళి ఏకాంతముగా తండ్రితో ఇలా అన్నాడు. "తండ్రీ! వీరులని పాండవులకు నేను వెరచుచుందును. అట్టి ధర్మజునకు నీవు యౌవరాజ్యపట్టమొసంగితివి. ప్రజలు, పౌరులు నిన్ను, భీష్ముని గౌరవించరు. గ్రుడ్డివాడగుట వల్ల ధృతరాష్ట్రుడు రాజ్యమేలలేదు. భీష్ముడు ముందే వదులుకున్నాడు. కావున ధర్మజునకు రాజ్యాభిషేకము చేయుదము. అతడు గుణవంతుడు, ధర్మశీలుడు, పరాక్రమవంతులైన తమ్ములను కలిగి వృద్ధులను, అమాత్యులను, బంధుమిత్రులను గౌరవించును. విదురుడిందుకు అంగీకరించునని తమలో అనుకొనుట నేను వినలేకపోతున్నాను. కనుక పాండవులిక్కడ లేకుండునట్లు చేయవలయును" అని దుర్యోధనుడు తెలుపగా-

ధృతరాష్ట్రుండిట్లనియె, "రాజయ్యెడువాడు తన రాజ్య భారంబు తాన చూచియరయవలయు. నేను షడంగ సహితముగ వేదాధ్యయనము చేసి, అర్థశాస్త్రమునందు కృత నిశ్చయుండనై బలంబు గలిగియు, అంగవైకల్యంబున పరచక్రంబులకు ప్రతివ్యూహములు రచియింపనేరమిం జేసి రాజ్యంబునకు తగకున్న-

ఉ. లోకనుతుండు పాండుదమలుండు మహాగుణ రత్న పూర్ణర
త్నాకరుడత్యుదారమతి నంధుడనైనను నన్ను రాజుగా
జేకొని నాకు భక్తిపనిసేయుచు సర్వ జగజ్జిగీషుడై
యీ కురువంశ రాజ్యభరమింతయు దాల్చె పరాక్రమంబునన్

వ. మరియు వానికంటె గుణంబుల మిక్కిలియై జనంబులకు ననురక్తుండై పరగుచున్న పాండురాజకుమారుల నెవ్విధంబున బాపనేర్తునని దుఃఖించిన ధృతరాష్ట్రునికి దుర్యోధనుండిట్లనియె.

సీ. **పైతృకంబగు లక్ష్మి పాండుభూపతి మున్ను**
**దాల్చుటజేసి తత్తనయుడైన**
**ధర్మజుడిప్పుడు దాల్చిన నాతని**
**తనయుండు దాల్చుమీద**
**నిప్పాట పాండువంశేశులు వసుమతీ**
**రాజ్యార్హులగుదురు రాజ్యమునకు**
**బరువడి మేమింతబాసిన మా పుత్ర**
**పౌత్రవర్గంబును బాయునింక**

ఆ. **నొరులగొలిచి కుడువనోపమేమట్లు గా**
**కుండ మమ్ము జేయనోపుదేని**
**పాండురాజు తొంటిభక్తియు నప్పాండు**
**తనయులందు దయయు దలపకుండు**

వ. ఈ రాజ్యంబు మొదలింటంగోలె భవదీయంబైనం ప్రకృతిజనులు వశ్యులు గాకున్నను క్రమాగతంబై మాకు నప్రయత్న లభ్యంబగు. తొల్లి పాండురాజురాజై గుణంబులం ప్రజానురాగంబు వడయుటంజేసి యెల్లవారును ధర్మరాజు రాజ్యంబు వలతురు. దాని నెరింగికాదె దానసమ్మానంబులం ప్రకృతి జనంబులకు సంతోషంబు చేయుచునుండుదు. నిందుల దుష్టజనంబుల పక్షపాతవచనంబులుడుగు నంత వరకు ఉపాయంబున కుంతిని, పాండవులను తదీయభృత్య అమాత్య వర్గంబుతో వారణావతంబునకుం బుత్తము. మనకు రాజ్యంబు సుప్రతిష్ఠితంబైన మతీ వారలిందులకు వత్తురనిన.."

ఇది షష్ఠాశ్వాసములోని ధృతరాష్ట్ర దుర్యోధనుల సంభాషణ.

పంచమాశ్వాసంలో ధృతరాష్ట్రుడే రాజ్యాభిషిక్తుడని వ్రాసినదానికి వ్యతిరేకంగా షష్ఠాశ్వాసంలో ధృతరాష్ట్ర దుర్యోధనుల సంభాషణ ఉండటం ఇక్కడ గమనార్హం. ఇక్కడ ధృతరాష్ట్రుడేమన్నాడు? నేను అంగవైకల్యం వల్ల (అంధుడనై నందువల్ల) రాజ్యంబునకు దగకున్న- అంటే రాజ్యాభిషేకానికి అనర్హుడనైనందువల్ల-అని. రాజ్యాభిషేకానికి అనర్హుడన య్యానని అతడే చెబుతున్నాడు. అలాంటి నన్ను గుణవంతు డైన పాండురాజు అంధుడనైన నన్ను రాజుగా జేకొని, నాపై భక్తితో పనిచేస్తూ ఈ రాజ్యభారం వహించాడు- అన్నాడు. అంటే అనర్హుడైనప్పటికి నన్ను పాండురాజు రాజుగా భావించి నాపై భక్తితో నడుచుకున్నాడు అని.

ఇక్కడ నిజంగా ధృతరాష్ట్రుడు రాజే అయితే ప్రత్యేకంగా పాండురాజు తనను రాజుగా భావించాల్సిన పనిఏముంది? ప్రత్యేకంగా తనపట్ల విధేయుడైయున్నాడని చెప్పాల్సిన పనేముంది? ధృతరాష్ట్రుడే రాజైయుంటే పాండురాజు విధేయుడుగా నడుచుకోవటం సామాన్య విషయమే గదా! కనుక జ్యేష్ఠుడైన తాను రాజుగాక, పాండురాజు రాజైనప్పుడే, తనను రాజుగా జేకొని, నాపై భక్తితో, విధేయుడై నడచు కున్నాడని చెప్పటం సరిపోతుంది.

ఇక దుర్యోధనుడు తండ్రితో ఏమన్నాడో చూస్తే రాజు ధృతరాష్ట్రుడో-పాండురాజో స్పష్టంగా తెలిపోతుంది.

"పైతృకంబగు లక్ష్మి (తండ్రినుండి వారసత్వంగా లభించిన రాజ్యాన్ని) పాండుభూపతి ముందుగా పొందటం వల్ల ఆయన కుమారుడైన ధర్మరాజు ఇప్పుడు పొందుతాడు. ధర్మరాజు ఇప్పుడు రాజైతే ఆతని కుమారుడు తరువాత రాజవుతాడు. ఈ విధంగా పాండువంశీయులే ఈ భూమిని పాలించ అర్హులవుతారు. ఇపుడు మేము రాజ్యానికి దూరమైతే మా పుత్రపౌత్రవర్గమంతా రాజ్యాధికారానికి దూరమైపోతారు. ఇతరులను కొలిచి జీవించజాలము. అలాకాకుండా మమ్ము చేయాలంటే మీరు ఇంతకుముందు పాండురాజుపై చూపిన వాత్సల్యము, దయ పాండుపుత్రులయందు చూపవద్దు"-అని.

ఈ దుర్యోధన వాక్యాలవల్ల "పాండురాజే వంశపారం పర్యంగా, వారసత్వహక్కుగా రాజ్యానికి అభిషిక్తుడయ్యాడని; అకారణంగా ఇప్పుడు ధర్మరాజు రాజైతే, ఆతని తరువాత ఆతని పుత్రుడు, ఆ తరువాత పౌత్రుడు. ఇలా పాండువంశీయులే రాజులవుతారు. మేము, మా పుత్ర పౌత్రవర్గమంతా రాజ్యాధి కారానికి దూరమైపోతాము. ఒకరికింద పనిచేస్తూ మేము బ్రతుకజాలం" అని బాధపడుతున్నాడు.

నిజంగా ధృతరాష్ట్రుడే రాజైయుంటే దుర్యోధనునికెందుకీ

బాధ? పాండురాజే రాజైనట్లు దుర్యోధనుడు స్పష్టంగానే తెలియజేస్తున్నాడు.

ఇంకా దుర్యోధనుడేమన్నాడు? "**ఈ రాజ్యంబు మొదలింటంగోలె భవదీయంబైన ప్రకృతి జనులు వశ్యులు గాకున్నను క్రమాగతంబై మాకు అప్రయత్నలభ్యంబగు. తొల్లి పాండురాజు రాజై ప్రజానురాగంబు వడయుటం చేసి యెల్లవారును ధర్మరాజు రాజ్యంబులతురు**"అని. అంటే ఈ రాజ్యము మొదటినుండి నీది కాకపోయినది గదా! అంటే పాండురాజు వనములకు వెళుతూ నీకు అప్పగించటం వల్ల ఈ రాజ్యం అప్పటినుండి నీ చేతికి వచ్చినది గాని మొదటి నుండి నీది కాదు అని. ధృతరాష్ట్రుడే రాజ్యాభిషిక్తుడైతే మొదటి నుండి నీదికాకపోయెనని ఎందుకంటాడు? కనుక పాండురాజే రాజ్యాభిషిక్తుడు గనుక మొదటినుండి ధృతరాష్ట్రునిది కాకపోయింది. పాండురాజు వనాలకు వెళుతూ ధృతరాష్ట్ర విదురులకు రాజ్యాన్ని వప్పగించి, అక్కడ శాపగ్రస్థుడై, తిరిగి రాకుండానే మరణించాడు. అందువల్ల అప్పటినుంచి రాజ్యం ధృతరాష్ట్రుని చేతికి వచ్చింది. ఇదే దుర్యోధనుని బాధ. బాధ ఎందుకంటే ఈ రాజ్యం మొదటినుండి ధృతరాష్ట్రునిదే ఐతే. అంటే ధృతరాష్ట్రుడే పట్టాభిషిక్తుడైతే-ప్రకృతి జనులు వశ్యులు గాకున్నను-అంటే పౌరులుగాని, అధికారులుగాని తమకు అనుకూలంగా లేకపోయినా-వారు ఔనన్నా కాదన్నా- ఈ రాజ్యం క్రమాగతమై అప్రయత్నంగా లభించేది. అంటే తండ్రి నుండి వంశపారంపర్యంగా తమకే వచ్చేది. పైగా అప్రయత్నంగా వచ్చేది. ఇప్పటిలాగా భీమాదులను చంపిగాని, పాండవులను లక్కయింట తగలబెట్టిగాని, ఏ ప్రయత్నమూ చేయకుండానే తమకీ రాజ్యం లభించేది; కాని తొల్లి పాండురాజు రాజై-అంటే ముందుగా పాండురాజే రాజై ప్రజారంజకంగా పరిపాలన చేయటంవల్ల ప్రజలంతా ధర్మరాజు రాజ్యాన్నే కోరుతున్నారు. అది తెలుసుకొనేగదా నేను అధికారులను, ప్రజలను అనేక విధాల సన్మానిస్తూ వారికి కావలసినవాటిని ఇస్తూ, వారికి అన్నివిధాల సంతోషం కలిగిస్తూ నా వైపుకు త్రిప్పుకుంటున్నాను- అన్నాడు దుర్యోధనుడు. కనుక ఈ దుర్యోధన వాక్యంవల్ల ధృతరాష్ట్రుడు రాజు కాలేదని, పాండురాజే పట్టాభిషిక్తుడని తేలిపోతున్నది.

మరి నన్నయగారు పంచమాశ్వాసంలో ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తుడని వ్రాసి, ఈ షష్ఠాశ్వాసంలో ధృతరాష్ట్ర దుర్యోధనుల పరస్పర సంభాషణల ద్వారా ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తుడు కాదని, పాండురాజే పట్టాభిషిక్తుడని వ్రాయటం వల్ల ఏది సరియైనది? అనే సందేహం ఎవరికైనా కలుగుతుంది. ఐతే గ్రంథమంతా ఎలా ఉన్నదో చూస్తే మొత్తం గ్రంథానికి వ్యతిరేకంగా ఉన్నదానిని తప్పుగా భావించి త్రోసి వేయవచ్చు. ఇప్పుడు మిగతా గ్రంథాన్ని చూద్దాం.

(1) ధర్మరాజును యువరాజుగా జేసి, రాజ్యపట్టాభిషేకం చేయకుండా ధృతరాష్ట్రుడు తాత్సారం చేస్తుంటే పురజనులు పెద్ద పెద్ద సభలలోను, చత్వరములందును ఇలా అనుకుంటున్నారు.

**శ్లో॥ ప్రజ్ఞాచక్షురచక్షుష్ట్వా ధృతరాష్ట్రో నరేశ్వరః**
**రాజ్యం న ప్రాప్తవాన్ పూర్వం సకథం నృపతిర్భవేత్॥**
**(ఆది140 అ.25శ్లో)**

**తా॥** అంధుడు కావటంవల్ల ధృతరాష్ట్రుడు ముందే రాజ్యాన్ని పొందలేకపోయాడు. అతడిప్పుడు రాజెలా అవుతాడు? (25) భీష్ముడు మొదటనే రాజ్యము చేయనని భీష్మించినాడు. కనుక ఇపుడు కూడా అతడు రాజ్యాన్ని స్వీకరించడు (26). ఇపుడు మనం ధర్మజుని పట్టాభిషిక్తుని చేద్దాం అని పౌరులు చెప్పుకుంటున్నారు (27). దీనినిబట్టి పౌరులు కూడా పాండు రాజే పట్టాభిషిక్తుడని-ధృతరాష్ట్రుడు రాజ్యానర్హుడని వారిలో వారు సభలలో మాట్లాడుకోవటం ఆదిపర్వం షష్ఠాశ్వాసంలోనే నన్నయగారి వ్రాతలో ఉన్నది.

(2) పాండవులను కుంతీదేవితో సహా లక్కయింట అగ్నికి ఆహుతి చేయాలనే దురుద్దేశంతో వారణావతానికి పంపేటప్పుడు, పాండవులతో కలిసి ప్రయాణమైన పౌరులు ఇలా అంటున్నారు. ఇదీ ఆదిపర్వం 145వ అధ్యాయంలోనిదే.

పాండవులను చూచి పౌరులు దుఃఖితులై వెంట వెళు తున్నప్పుడు కొందరు బ్రాహ్మణులు నిర్భయంగా "విషమంగా చూస్తున్న ధృతరాష్ట్రుడు ధర్మదృష్టి కలవాడు కాదు. **తండ్రి నుండి పాండవులు హక్కుగా రాజ్యాన్ని పొందారు.** అట్టివారి యెడల ఏ మాత్రం సహనం లేకుండా ఉన్నాడు ధృతరాష్ట్రుడు. పాండవులను నగరం నుండి పంపించటమనే అధర్మానికి భీష్ముడెలా అంగీకరించాడు? పూర్వము ప్రభువైన విచిత్రవీర్యుడును, పాండురాజున్ను మనకు తండ్రిలాగా రక్షకులైనారు. పాండురాజు మరణించిన తర్వాత పాండవులను ధృతరాష్ట్రుడు సహించలేకపోతున్నాడు" దీనిలో పూర్వం విచిత్రవీర్యుడు, ఆ తర్వాత పాండురాజు అని పేర్కనటం వల్ల పాండురాజే రాజైనట్లు పౌరులమాటలు నిర్ధారిస్తున్నాయి.

(3) ఇక ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణరాయబార సమయంలో దుర్యోధనునకు హితబోధ చేస్తూ-

**భీష్ముడు:** నాయనా దుర్యోధనా! పెద్దవాడయ్యూ అంధుడగుటచేత ధృతరాష్ట్రుడు రాజ్యానర్హుడు కాగా పాండు రాజే రాజయ్యాడు. ఆ పాండురాజే రాజ్యానికధీశ్వరుడు. పాండవులు

వారి తండ్రి రాజ్యాన్ని పాలించనర్హులు-అని;

**ద్రోణుడు:** దుర్యోధనా! ప్రతీపుని కుమారుడు శంతనుడెట్లు కులాన్ని ఉద్ధరించాడో, శంతనుపుత్రుడు భీష్ముడు ప్రతినగావించి ఎలా కులాన్ని ఉద్ధరించాడో అలాగే పాండుభూపతి కులాన్ని ఉద్ధరించాడు. అతడు నీ జనకుని సింహాసనమున నిలిపి వనాలకు వెళ్ళాడు-అని,

**గాంధారి:** దుర్యోధనా! నీవు పాపబద్ధుడవు. ఈ రాజ్యము పాండునరపాలునిది. దానిని పొందుటకు వారి పుత్రులే అర్హులు. కురుముఖ్యుడు, సత్యసంధుడు, మహావిద్వాంసుడునగు భీష్ముడెట్లు ఆనతిచ్చిన అట్లు గావింపుము-అని;

**ధృతరాష్ట్రుడు:** నాయనా! నేను హీనాంగుడగుట వలన పాండుడు ఈ పృథివికి రాజయ్యెను. నేను జ్యేష్ఠుడనయ్యూ రాజ్యార్హుడను కాను. పాండుడు కనిష్ఠుడయ్యు రాజయ్యెను. ఆతని మరణానంతరము రాజ్యము వాని సుతులకు లభించవలెను. వత్సా! రాజ్యమునకు నేనే అభాగినైయుండ నీవేల ఆశించెదవు? సత్యసంధుడు, ప్రజలకు ప్రియుడు, సాధువు అయిన ధర్మజుడే రాజు కాదగును. పాపుడవు, లుబ్ధుడవు, అనార్యవృత్తుడవు అగు నీవు అజ్ఞానము విడచి పాండవుల కర్ధరాజ్యమిచ్చి మిగిలిన భాగముతో సుఖించుము-అని ఈ భీష్మ, ద్రోణ, గాంధారీ, ధృతరాష్ట్రుల వాక్యాలవల్ల పాండురాజే పట్టాభిషిక్తుడని అంధత్వం వల్ల ధృతరాష్ట్రుడు రాజు కాలేదని స్పష్టం.

(4) ధృతరాష్ట్రుడు తపస్సుకై వనవాసానికి వెళ్ళేటప్పుడు ప్రజలను రావించి వారి అనుమతిని కోరుతూ ఇలా అంటున్నాడు. ఇది ఆశ్రమవాస పర్వంలోనిది.

**సీ. ప్రజముద మొందంగ బాలించె బుడమి**
**శం,తను డనంతరమ శాంతనవుచేత**
**రక్షితుడగుచు మీరలు బ్రీతిబొదలవి,**
**చిత్రవీర్యుండు నిద్ధాత్రినేలె**
**బదపడి పాండునృపాలుండు మీరు హ**
**ర్షింపగ భూమి రక్షించె బిదప**
**ధర్మనందనుని చందము మీయెఱింగిన,**
**యది సత్యధర్మాత్ముడైన యితని**
**తే. ననుసరింపక యన్యాయమాచరించి,**
**దుర్ణయంబున నిలయేలి త్రుంబెగులము,**
**నుర్విగలభూపతులను దుర్యోధనుండు,**
**వాని దుశ్చేష్టలకు మూలమేనకాదె**
**వ. అది మీమనంబులం బెట్టక**
**క. మహిలెస్సగ రక్షించిన,**
**మహితగుణుల యన్న కొడుకు మనుమండని నా**
**కు హితంబు గోరి కరుణా,**
**సహితులై యిందనుజ్ఞ సద్వ్రతమునకున్. (ఆశ్ర 1 ఆశ్వా)**

"ప్రజలకు సంతోషం కలిగేటట్లు శంతనుడు పాలించాడు, భీష్మరక్షితుడై విచిత్రవీర్యుడు పాలించాడు. పిమ్మట పాండురాజు పాలించె, ఇక ధర్మనందనుని పాలన మీకు తెలుసు. ఇతడిని అనుసరింపక నా పుత్రుడు దుర్యోధనుడు కులనాశనం గావించాడు. దీనికంతకు నేనే కారణం. అది మీ మనస్సులలో పెట్టుకోకుండా గుణవంతులైన పాలకుల అన్న, కొడుకు, మనుమడు అని నా శ్రేయస్సును గోరి నాకు అనుజ్ఞఇందు" – ఇది ధృతరాష్ట్రుని విన్నపం.

ఇక్కడ శంతనుడు, విచిత్రవీర్యుడు, పాండురాజు, ధర్మరాజు అని పాలకుల వరుసక్రమం చెప్పాడు. ఇందులో తనపేరు లేదు. విచిత్రవీర్యుని తదనంతరం పాండురాజును, ఆ తర్వాత ధర్మరాజును పేర్కొన్నాడు. దీనినిబట్టి తాను రాజ్య పట్టాభిషిక్తుడు కాదని తెలియజేశాడు. అంతేగాదు తనను రాజుగా కాక గుణవంతులైన పాలకులకు అన్న, కొడుకు, మనుమడుగా చెప్పుకున్నాడు. అంటే పాండురాజుకు అన్న, విచిత్రవీర్యునికి కొడుకు, శంతనునికి మనుమడు అని భావం.

ఇలా ఆంధ్రమహాభారతగ్రంథం అంతా పాండురాజే పట్టాభిషిక్తుడని, ధృతరాష్ట్రుడు అంధత్వం వల్ల రాజ్యాభిషిక్తుడు కాలేదని నిర్ద్వంద్వంగా తెలియజేస్తున్నది. గ్రంథమంతా ధృతరాష్ట్రుడు రాజ్యానర్హుడని, పట్టాభిషిక్తుడు పాండురాజేనని చెబుతుంటే ధృతరాష్ట్రుడు రాజ్యాభిషిక్తుడైనట్లు వ్రాసిన ఆదిపర్వం పంచమాశ్వాసంలోని నన్నయ గారి వ్రాతసత్యమెలా అవుతుంది? కాదు, కావటానికి వీల్లేదు.

అయితే నన్నయగారిలాంటి కవి అలా తప్పుగా ఎందుకు వ్రాస్తాడు? బహుశా నన్నయ గారు ఒకటిగాక ఎక్కువ మూలప్రతులను దగ్గర పెట్టుకొని తన అనువాదాన్ని కొనసాగించి ఉండవచ్చు. అలాంటి ప్రతులలో ఆనాడు ఏదో ఒకదానిలో ఈ అపపాఠం ఉండి ఉండవచ్చు. కనుక అలా వ్రాసి ఉండవచ్చు. అది సాంప్రదాయక పాఠం కాదని, గ్రంథమంతటికీ విరుద్ధమని గ్రహించాలి. అంతేగాక ఈనాడు లభిస్తున్న మూలగ్రంథాలన్నింటిలోను పాండురాజ పట్టాభిషేకమే ఉండటం వల్ల; పరిశోధిత గ్రంథంలో కూడా అలాగే ఉండటం వల్ల; పాండురాజే పట్టాభిషిక్తుడని గ్రహించాలి. పాండురాజే పట్టాభిషిక్తుడు గనుక పాండవులదే కురుసామ్రాజ్యాధిపత్యము.

కురుసామ్రాజ్యాధిపత్యం పాండవులదే అనటానికి దుర్యోధనునకు హక్కులేదు అనటానికి మహాభారతంలో ఇంకా ఏవైనా ఆధారాలున్నాయా? **(వచ్చేసంచికలో...)**



# మహాభారతం

## కురుసామ్రాజ్యాధిపత్య నిర్ణయము 13


రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716


(గతసంచిక తరువాయి)

ఇంతవరకు కురుసామ్రాజ్యానికి పట్టాభిషిక్తుడైన రాజు ఎవరు అనే అంశంపై జరిగిన చర్చలో జాత్యంధుడైనందున జ్యేష్ఠుడైనను ధృతరాష్ట్రుడు రాజు కాలేదని; అందువల్ల కనిష్ఠుడైనను పాండురాజే రాజ్యాభిషిక్తుడయ్యాడని అనేకమైన ఆదారాలతో-మహాభారత గ్రంథంలోని విషయాలను ఉటంకిస్తూ ఋజువుచేయటమైంది. ఇక ఆంధ్రమహాభారతంలో నన్నయ్యగారు ధృతరాష్ట్రుడే పట్టాభిషిక్తుడైనట్లు వ్రాసిన వ్రాత-'మొత్తం గ్రంథానికి ఎలా విరుద్ధమో' విపులంగా తెలియ జేయుట జరిగినది. ఆంధ్రమహాభారతం ఆదినుండి చివరి వరకు పాండురాజ రాజ్యవాదాన్నే సమర్ధించటాన్ని, పైగా ధృతరాష్ట్రుడే తాను పట్టాభిషిక్తుడు కాలేదని, తన సోదరుడు పాండురాజే రాజయ్యాడని తెలియజేయటాన్ని కూడా సవివరంగా అందించటం జరిగింది.

సరే, జ్యేష్ఠుడైన ధృతరాష్ట్రుడు అంధత్వం వల్ల రాజు కాలేకపోయాడు. పాండురాజే కనిష్ఠుడైనప్పటికీ రాజయ్యాడు. ఆ తర్వాత పాండరాజు వనాలకు వెళుతూ రాజ్యాన్ని ధృతరాష్ట్ర విదురులకప్పగించి వెళ్లాడు. ఆయన తిరిగి రాకుండానే అక్కడే మరణించాడు. అందువల్ల ధృతరాష్ట్రుడే రాజ్యపాలన చేశాడు. కనుక ఇప్పుడు ధృతరాష్ట్రపుత్రుడు - ఏ దోషాలు లేకుండా ఉన్న **దుర్యోధనునికి రాజ్యంపై హక్కు ఉంటుందా?** లేక పట్టాభిషిక్తుడైన పాండురాజపుత్రుడు **ధర్మరాజుకే రాజ్యంపై హక్కు ఉంటుందా?** ఈ విషయాలపై గ్రంథం ఏమి చెబుతున్నదో విచారణ చేద్దాం.

**1) దుర్యోధనుని జనన సమయంలో ధృతరాష్ట్రుడేమని ప్రకటించాడు?**

జ: గాంధారి గర్భతాడనం చేసుకోగా మాంసపిండం బయటపడింది. దానిని వ్యాసుడు 101 ముక్కలుగా విభాగం చేసి నేతికుండలయందుంచి సంరక్షణ చేయమనగా అట్లే చేశారు. 2 సంవత్సరముల తరువాత మొదటి కుండ నుండి దుర్యోధనుడు జన్మించాడు. దుర్యోధనుడు పుట్టగానే గ్రద్దలు రాజభవనం చుట్టూ ఎగురుతూ విపరీతంగా కూస్తూ తిరుగు తున్నాయి. వాటి అరుపులకు మరికొన్ని గ్రద్దలు, కాకులు, రాబందులు భయంకరంగా అరుస్తూ ఆకాశంలో తిరుగు తున్నాయి. దూరం నుండి నక్కలు అరుస్తున్నాయి. దిక్కులన్నీ చీకట్లు అలుముకున్నాయి. ధృతరాష్ట్రుడు ఈ విపరీత ఉత్పాతాలకు భయపడి అనేకమంది బ్రాహ్మణులను, భీష్మ విదురులను, ఇతర సుహృదులను, కురువంశీయులను రావించి వారితో ఇలా అంటున్నాడు. (ఆదిపర్వం 114అ. 25 నుండి 30 వరకు శ్లోకములు)

**శ్లో॥ యుధిష్ఠిరో రాజపుత్రో జ్యేష్ఠో నః కులవర్ధనః**
**ప్రాప్తః స్వగుణతో రాజ్యం నతస్మిన్ వాచ్యమస్తినః॥**
**(ఆది. 114అ.31శ్లో)**

**తా॥** గురుజనులారా! మా కులము యొక్క కీర్తిని పెంచే రాజపుత్రుడు యుధిష్ఠిరుడు జ్యేష్ఠుడు. అతడు తన గుణముల చేత రాజ్యాన్ని పొందటానికి అధికారి అయ్యాడు. అతడి విషయంలో నాకు మరొకమాట చెప్పవలసిన పనిలేదు-అని.

ధృతరాష్ట్రుడిలా ప్రకటించేనాటికి ధర్మరాజు వయస్సు 2 సంవత్సరములు మాత్రమే. అసలు ధృతరాష్ట్రుడుకాని, భీష్మాదులుకాని ధర్మరాజును చూడనేలేదు. కేవలం కుంతీదేవికి పాండురాజ నియోగంతో ధర్మదేవతవల్ల జన్మించాడని వినటం మాత్రమే జరిగింది. పైగా ఇక్కడ కుంతీ దేవి గాని, పాండురాజుగాని లేనేలేరు. వారు శతశృంగమనే పర్వతంపై

మునులతో కలసి నివాసముంటున్నారు. కనుక ధృతరాష్ట్రుడే స్వయంగా ప్రకటించటాన్నిబట్టి జ్యేష్ఠుడైన ధర్మరాజే ఉత్తరాధికారి అని స్పష్టమవుతున్నది. కనుక రాజ్యంపై హక్కు ధర్మరాజుదే.

**2) భీముని చంపాలనే ఆలోచన ఆటలాడుకొనే సమయంలోనే దుర్యోధనునికి ఎందుకు గలిగింది?**

జ:. శతశృంగం నుండి తండ్రి మరణానంతరం తల్లితో సహా పాండవులు హస్తినాపురం చేరారు. దుర్యోధనాదులతో కలిసి ఆటపాటలలో, విద్యలు నేర్చుకోవటంలో నిమగ్నమయ్యారు. భీముని యొక్క బలపరాక్రమాలు, శక్తి సామర్థ్యాలు గమనించిన దుర్యోధనుడు అతడు గొప్పబలశాలియని నిశ్చయించుకొని అతడిపట్ల ఈర్ష్య, దుష్టభావాలు కలిగి ఉన్నాడు. దుర్యోధనుడు ఎల్లప్పుడూ ధర్మదూరుడై పాపకర్మలయందు దృష్టి నిలిపాడు. మోహంతో, ఐశ్వర్యలోభంతో అతడి మనస్సులో అన్నీ పాపంతో కూడిన ఆలోచనలే కదులుతున్నాయి. దుర్యోధనుడు తన సోదరులతో ఇలా ఆలోచిస్తున్నాడు– "బలవంతులందరిలో బలవంతుడైన ఈ భీముని ఎలాగైనా పట్టి బంధించాలి. ఇతడు బలవంతుడే కాదు పరాక్రమవంతుడు, శౌర్యశాలి. భీముడొక్కడే మనందరినీ అణచివేయగలడు. (ఆదిపర్వం 127అ.25 నుండి 28 శ్లో)

**శ్లో॥ తం తు సుప్తం పురోధ్యానే గంగాయాం ప్రక్షిపామహే।**
**అథ తస్మాదవరజం శ్రేష్టం చైవ యుధిష్టిరం॥**
**శ్లో॥ ప్రసహ్యా బంధనే బధ్వా ప్రశాసిష్యే వసుంధరాం।**
**ఏవంస నిశ్చయం పాపః కృత్వా దుర్యోధనస్తదా॥**
**(ఆది ప.127 అ.29-30శ్లో)**

**తా॥** అందువల్ల నగరోద్యానంలో అతడు అలసిపోయి నిద్రించేటప్పుడు అతణ్ణి ఎత్తి గంగానదిలో పడేద్దాం. ఆ తర్వాత అగ్రజుడైన ధర్మరాజును, చిన్నవాడైన అర్జునుని బలాత్కారంగా బంధించి చెరసాలలో పడవేసి, ఈ వసుంధరా రాజ్యాన్ని నేనొక్కడినే ఏలుకుంటాను. ఇలా నిశ్చయించి పాపాత్ముడైన దుర్యోధనుడు భీమునికి అపకారం చేయటానికి సమయం కొరకు ఎదురుచూస్తున్నాడు.

ఇలా దుర్యోధనుడు ఆటలాడుకొనే వయస్సులోనే, విద్యాభ్యాసం చేసే సమయంలోనే ఇటువంటి దుష్టబుద్ధి కలిగి, దుష్టకార్యాలకు దిగటంలోని ఆంతర్యం ఏమిటి? రాజ్యాధికారం సర్వజ్యేష్ఠుడైన ధర్మరాజుదే గనుక; ధర్మరాజును ఏదైనా చేయాలంటే భీముడుండగా అది సాధ్యం కాదు గనుక; ముందుగా భీముని అడ్డు తొలగించుకొని, ధర్మజాదులను బంధించి అపాండవముగా ఈ రాజ్యం ఏలుకోవాలి అనే. పైగా తానే స్వయంగా అన్నాడు. ఇలాంటి ఆలోచనలు చేస్తున్న దుర్యోధనుని వయస్సు అప్పటికి సుమారు 16 సంవత్సరములు మాత్రమే. దీనినిబట్టి కూడా రాజ్యానికి ఉత్తరాధికారి ధర్మరాజేనసుట నిశ్చయం.

ఈ సందర్భంలోనే 'మహాభారతచరిత్ర' గ్రంథకర్త పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు "భీముడు చిన్నతనపుటాటలలో కౌరవులను బాధించుటచేతనే కురుపాండవులకు విరోధబీజమేర్పడినది. ఈ భీముని బాధలు తట్టుకోలేకనే భీముని చంపుటకు మహాపకారం తలపెట్టాడు దుర్యోధనుడు" అని దుర్యోధనుని సమర్థిస్తూ; దుర్యోధనునిది పాపకృత్యమని వ్యాసుడు వ్రాస్తే – అలా చంపతలపెట్టటం తమను పెట్టిన బాధలకు ప్రతీకారంగా చేసినదేగాని, దుర్యోధనుని తప్పులేదని వీరు సెలవిచ్చారు. వీరి విమర్శను పరిశీలిద్దాం.

ఆటలలో ఎవరో ఒకరు గెలవటం, మిగిలినవారు ఓడిపోవటం సహజం. కొన్నిరకాల ఆటలలో శరీరాలకు దెబ్బలు తగలటం కూడా సహజమే. ఓడినవారు గెలిచేందుకు గొప్ప సాధన చేసి విజయం సాధించాలేగాని, గెలిచినవారిని చంపాలని చూడటం క్రీడాస్ఫూర్తి కాదు. అలా గెలిచినవారిని చంపుకుంటూపోతే ఆటలాడేవారెవరూ ఉండరు. కురుపాండవులు క్షత్రియులు. వారు సుకుమారులు కాదు. శరీరాలకు గాయాలు కావటం, దెబ్బలు తగలటం, ఒక్కో సందర్భంలో ప్రాణాలు పోవటం కూడా యుద్ధవిద్యలలో సహజమే. శరీరము ఛిన్నాభిన్నమైనా వెనుదీయక పోరాడటం వారి లక్షణం. కనుక దుర్యోధనుడు భీముని చంపాలనుకున్నది ఆటలలో తమను బాధించినందుకు కాదు, మరెందుకు? భీముడు బలవంతులైన వారిలో బలవంతుడైనందుకు; బలవంతుడేకాదు పరాక్రమవంతుడు, శౌర్యశాలి అయినందుకు, మరొక విషయం– భీముడు తమను ఆటలలో బాధించినందుకు కదా! భీముని బంధించాలని, గంగలో త్రోయాలని, చంపివేయాలని తలచింది! మరి ధర్మరాజు, అర్జునుడు ఏ అపకారం చేశారు? వారు ఆటలలో, కౌరవులను బాధించినట్లు ఎక్కడా లేదుకదా! మరెందుకు వారిద్దరినీ బంధించి కారాగారంలో వెయ్యాలనుకున్నాడు? **"శ్రేష్ఠంచైవ యుధిష్ఠిరం ప్రసహ్యా బంధనే బధ్వా ప్రశాసిష్యే వసుంధరాం"**– అర్జున యుధిష్ఠిరులను బంధించి ఈ రాజ్యాన్ని ఏలుకుంటాను–అని స్వయంగా దుర్యోధనుడు చెప్పిన వాక్యం వల్ల అర్థం కావటం లేదా? ఎందుకు ఈ దుష్టమైన ఆలోచన చేశాడో? భీముని అడ్డు తొలగిస్తేగాని

ధర్మజార్జునులజోలికి పోలేరు. పాండవులను అంతం చేస్తే గాని తనకు రాజ్యం రాదు. ఇదీ దుర్యోధనుని దురాలోచన, దుష్టబుద్ధి. ఇక మరొక ముఖ్య విషయం. 'తనను చంపటానికి విషాన్నం పెట్టి, గంగలో త్రోయించినా అనేక విధాల ప్రయత్నాలు చేసినా, దుర్యోధనుని చంపాలనే ఆలోచన భీమసేనునకు కలుగలేదు' అనే విషయాన్ని ఇక్కడ విజ్ఞులు గ్రహించాలి. పాపం శాస్త్రిగారు దుర్యోధనుని పక్షం వహించి ఎంత కష్టపడ్డా మహాభారత గ్రంథం అందుకు అనుమతించకపోవటాన్ని గమనించి, ఆ పక్షం వహించినవారు దుర్యోధనునివంటి ద్రోహబుద్ధిని మానుకోవాలి. దుర్యోధనుడు కూడా తన ద్రోహబుద్ధిని సమర్థించుకోవటానికి ఇంతగా దిగజారలేదనే విషయం కూడా గ్రహించాలి.

**3) ధృతరాష్ట్రుడే పట్టాభిషిక్తుడైతే ఆయన కుమారుడు దుర్యోధనుడే యువరాజు కావాలి. మరి పాండురాజపుత్రుడైన ధర్మరాజును ధృతరాష్ట్రుడెందుకు యౌవరాజ్యాభిషిక్తుని చేశాడు?**

జ: దుర్యోధనుడు పుట్టినప్పుడు అనేక ఉత్పాతాలు జరిగినవి. దానికి భయపడిన ధృతరాష్ట్రుడు బ్రాహ్మణులను, భీష్మవిదురాది కురువంశీయులను, ఆత్మీయులను రావించి,

**శ్లో॥ యుధిష్ఠిరో రాజపుత్రో జ్యేష్ఠోనః కులవర్ధనః**
**ప్రాప్తః స్వగుణతో రాజ్యం నతస్మిన్ వాచ్యమస్తినః॥**
**(ఆది 114 అ. 31శ్లో)**

– మా కులవర్ధనుడైన యుధిష్ఠిరుడు జ్యేష్ఠుడు. అతడు తన గుణములచేత రాజ్యాన్ని పొందటానికి అధికారి అయ్యాడు. ఈ విషయంలో నాకు మరొక మాటలేదు–అన్నాడు ధృతరాష్ట్రుడు. ఇక్కడ ఎవరూ అడగకుండానే తనంతట తానుగా ఈ విషయాన్ని చెప్పాడు. ఆ చెప్పటంలో యుధిష్ఠిరుడు జ్యేష్ఠుడు–అని కూడా చెప్పాడు. రాజ్యాంగ నియమం ప్రకారం జ్యేష్ఠునికే అధికారం వస్తుంది గనుక ధృతరాష్ట్రుడిలా చెప్పటం జరిగింది. రాజ్యంపై హక్కు ధర్మరాజుదే గనుక ధృతరాష్ట్రుడు ధర్మజుని యౌవరాజ్యాభిషిక్తుని చేశాడు.

మరొక విషయం. పాండవులు గురుదక్షిణగా ద్రుపదుని జయించి, బంధించితెచ్చి ద్రోణాచార్యుని పాదాలపై పడవేయటంతో పాండవుల బలపరాక్రమాలు పౌరులకు విదితమైనవి. పాండవులయొక్క గుణగణాలు ఎలాంటివో తెలిసింది. దానితో వారు ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా ధర్మరాజును రాజ్యపట్టాభిషిక్తుని చేయాలని సభలలోను, చత్వరములందును ఇలా ప్రసంగించుకుంటున్నారు. "ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు కావటం వల్ల ఇంతకుముందే రాజ్యాన్ని పొందలేదు. ఇప్పుడుమాత్రమెలా రాజవుతాడు? భీష్ముడు ముందే రాజ్యము చేయనని భీష్మించినాడు. కనుక ఇప్పుడు జ్యేష్ఠుడైన ధర్మరాజును పట్టాభిషిక్తుని చేద్దాం" అని.

పౌరులిలా ప్రసంగించుకోవటంలో అనేక ధర్మరహస్యాలు ఇమిడిఉన్నాయి. పాండురాజు వనాలకు వెళ్ళిన తర్వాత, మరణించిన తర్వాత వారసులు లేకపోవటంతో ధృతరాష్ట్రుడే సింహాసనం అధిష్టించాడు. అంతకన్నా గత్యంతరం లేదు. భీష్ముడు అధికారే అయినప్పటికీ తన ప్రతిజ్ఞకు కట్టుబడి రాజ్యాభిషిక్తుడు కాడు. అందువల్ల పౌరులు ధృతరాష్ట్రుని అంగీకరించారు. ఇపుడు కురుపాండవులు విద్యాభ్యాసం పూర్తి చేశారు. యౌవనదశలో ప్రవేశించారు. కనుక ఇంకా పట్టాభిషిక్తుడైన రాజు లేకుండా ఉండవలసిన అగత్యం లేదు. ఐతే ఇప్పుడు ఎవరు రాజు కావాలి? ధృతరాష్ట్రపుత్రుడు దుర్యోధనుడా? పాండరాజపుత్రుడు ధర్మరాజా? అదీ ఆలోచించారు. అందరిలోకి జ్యేష్ఠుడు ధర్మనందనుడే గనుక, పట్టాభిషిక్తుడైన పాండరాజపుత్రుడే గనుక; సద్గుణరాశి గనుక; ఏ దోషాలులేనివాడు గనుక ధర్మజునే పట్టాభిషిక్తుని చేయాలనుకున్నారు. ధృతరాష్ట్రుడు ఆలస్యం చేస్తున్నాడు అనే భావన కూడా వారిలో ఉంది. అందుకే ధర్మజుని పట్టాభిషిక్తుని చేద్దాం అని అంటున్నారు. కనుక పౌరుల అభిప్రాయం ప్రకారం కూడా ధర్మజుడే రాజ్యాధికారి.

పౌరుల అభిప్రాయాలు తెలుసుకున్న ధృతరాష్ట్రుడు ప్రస్తుతం తన చేతుల్లో నుండి రాజ్యాధికారం జారిపోకుండా ఉండటానికి, తనంతట తానే ధర్మజుని యువరాజుగా అభిషేకించి, భీష్మాదులతో ఉత్తరాధికారి యుధిష్టిరుడే' అని ప్రకటించాడు. నిజంగా ధర్మరాజుకు అధికారం లేకపోతే ధృతరాష్ట్రుడు అతణ్ణి యువరాజుగా చేస్తాడా?–

ఈ సందర్భంలో కాశీభట్లబ్రహ్మయ్య శాస్త్రులు గారు తమ 'ధాయభాగ వినిర్ణయము'లో "ధర్మజుని యువరాజుగా చేయుటకు గల కారణము ధృతరాష్ట్రునకు పాండవులయందు గల స్థిరసౌహార్దమే గాని, పాండవులకు రాజ్యంపై హక్కు ఉన్నదని కాదు" అని తెలిపారు.

దీనినిబట్టి ధృతరాష్ట్రుడెంతటి త్యాగశీలియో, బుద్ధిమంతుడో, గుణవంతుడో తెలుసుకోవచ్చు. ఎందుకంటే తనచేత చిక్కిన కురుసామ్రాజ్యాన్ని; ప్రస్తుతం తానే పాలకుడుగా ఉన్న కురుసామ్రాజ్యాన్ని; తనకు ప్రేమాస్పదుడై; తన ప్రాణానికి ప్రాణమైయున్న తన జ్యేష్ఠ కుమారుడు దుర్యోధనునికే సర్వహక్కులూ ఉన్నప్పటికీ; అతడికి రాజ్యాభిషేకం చేయకుండా

తన సోదరపుత్రులపట్ల గల సౌహార్దం కారణంగా రాజ్యాన్ని ధారపోశాడట. ఇంతటి త్యాగి ఎవరుంటారు? ఆ త్యాగమూర్తి త్యాగాన్ని ప్రశంసించే శాస్త్రులు గారిలాంటి వారెంద రుంటారు?- ధృతరాష్ట్రునికి పాండవుల పట్ల గల సౌహార్దం ఏమిటో చూద్దాం..

(I) ధృతరాష్ట్రుడెలాంటివాడో ముందుగా శతశృంగ మునుల మాటలలో చూద్దాం. (ఆది. 124 అ). పాండురాజు మరణానంతరం కుంతీ, మాద్రి-నేను సహగమన చేస్తానంటే నేను చేస్తానని ముందుకొచ్చారు. ఆ సమయంలో అక్కడి మునులు మీరిద్దరు జీవించే ఉండాలి. ఎవరూ సహగమనం చేయవద్దు. ఎందుకంటే-

**శ్లో॥ అధర్మేష్వర్థజాతేషు ధృతరాష్ట్రశ్చ లోభవాన్।**
**స కదాచిన్న వర్తేత పాండవేషు యధావిధి ॥**

**శ్లో॥ కుంత్యాశ్చ వృష్ణయో నాథాః కుంతి భోజస్తథైవచ।**
**మాద్రవ్యాశ్చ బలినాం శ్రేష్ఠః శల్యోభ్రాతా మహారథః॥**

తా॥ ధృతరాష్ట్రుడు అధర్మపూర్వక ధనం కొరకు ఆశపడే లోభి. అందువల్ల అతడు ఎప్పుడూ పాండవులపట్ల సరిగ్గా ప్రవర్తించడు. కుంతీదేవికి వృష్ణివంశీయులు, కుంతిభోజుడు రక్షణగా సహాయులుగా ఉంటారు. మాద్రికి తన సోదరుడైన మహాబలుడు, మహారధుడయిన శల్యుడు సాయంగా ఉంటాడు. కనుక ఇరువురూ జీవించియుండుటయే శ్రేయస్కరం-అని దీనినిబట్టి ధృతరాష్ట్రునికి పాండవులపట్ల ఎంతటి సౌహార్ధమో వనాలలో తపస్సు చేసుకుంటూ జీవించే మహాత్ములైన మునిపుంగవుల మాటల ద్వారా తెలుసుకోవచ్చు.

(II) యౌవరాజ్యాభిషేకానంతరం భీమార్జునులు దిగ్విజయ యాత్రకు వెళ్ళి అనేక రాజ్యాలను జయించారు. పాండురాజు జయించలేక విడిచిపెట్టిన రాజ్యాలను కూడా జయించి అపార ధనరాసులను సంపాదించారు. గంధర్వులను జయించిన సౌవీర, యవన దేశరాజులను పాండురాజు వదలి వేస్తే, అర్జునుడు వారిని జయించి తన వశంలోనికి తెచ్చు కున్నాడు. తూర్పు, దక్షిణదిక్కులకు కూడా వెళ్ళి అనేక రాజులను జయించాడు. దానితో ఎక్కడ చూచినా పాండవుల వైభవాన్ని ప్రజలు వేనోళ్ళ ప్రశంసిస్తున్నారు. (ఆది. 137అ. 20-26శ్లో)

**శ్లో॥ తతోబలమతిఖ్యాతం విజ్ఞాయ దృఢధన్వినాం।**
**దూషితః సహసాభావో ధృతరాష్ట్రస్యపాండుషు॥**
**సచింతా పరమోరాజాన నిద్రామలభన్నిశి॥**
**(ఆది. 137అ. 27శ్లో)**

తా॥ పాండుకుమారుల బలపరాక్రమాల విషయాన్ని తెలుసుకున్న ధృతరాష్ట్రుడు మనోవేదనకు గురయ్యాడు. ఆ చింతతో మహారాజు రాత్రులందు నిద్రకు దూరమయ్యాడు. ఇదీ ధృతరాష్ట్రునికి పాండవులపట్ల గల సౌహార్దం. ప్రస్తుతానికి రాజు తానే. ధర్మరాజు కేవలం యువరాజు మాత్రమే, రాజ్యాలను జయించితెచ్చిన ధనరాసులు వస్తున్నది తనకే. వృద్ధి అవుతున్నది తమ రాజ్యమే. అయినా పాండవ పరాక్రమాన్ని తలచుకొని, చింతించి, రాత్రులందు నిద్రకు కూడా దూరమయ్యాడు ధృతరాష్ట్రుడు. ఈ ధృతరాష్ట్రుడు పాండవులపట్ల సౌహార్దము గలవాడట.

(III) ఇక ధృతరాష్ట్రుని నోటిమీదుగానే పాండవుల పట్ల గల సౌహార్దం ఏపాటిదో తెలుసుకుందాం.

పాండుపుత్రుల శౌర్యపరాక్రమాలకు వ్యాకులత చెంది, చింతాక్రాంతుడైన ధృతరాష్ట్రుడు శకుని మంత్రి ఐన కణికుని రావించి అతడితో ఇలా అంటున్నాడు. (ఆది 1396.1-2శ్లో)

**శ్లో॥ ఉత్సిక్తాః పాండవా నిత్యం తేభ్యో ఽసూయే ద్విజోత్తమ।**
**తత్ర మే నిశ్చితతమం సంధివిగ్రహ కారణం।**
**కణికత్వం మమాచక్ష్వ కరిష్యే వచనం తవ॥**
**(ఆది. 139 అ. 3 శ్లో)**

తా॥ ఓ ద్విజశ్రేష్ఠా! కణికా! రోజురోజుకూ పాండవుల యొక్క ఖ్యాతి పెరిగిపోతున్నది. వారి అభివృద్ధిని చూచి నేను సహించలేకపోతున్నాను. కనుక నీవు జాగ్రత్తగా ఆలోచించి నిశ్చయించి చెప్పు. నేను వారితో మంచిగా ఉండాలా? విరోధం పెట్టుకోవాలా? నీవు ఎలా చెబితే అలాగే చేస్తాను.

-ఇది ధృతరాష్ట్రుడు స్వయంగా తన నోటితోనే పాండవుల పట్ల గల సౌహార్దాన్ని తెలియజెప్పిన సంఘటన.

ఇంతకన్నా ధృతరాష్ట్రుని దుష్టబుద్ధి తెలుసుకొనేందుకు మరేమి ఋజువులు కావాలి?

(IV) కణికుని సలహాపై పాండవులను దూరంగా పంపి తుదముట్టించాలని మనస్సులో నిశ్చయించుకున్న ధృతరాష్ట్రుని వద్దకు దుర్యోధనుడు వచ్చి ధర్మజ యౌవరాజ్యాభిషేకానికి చింతించి, మొదటినుండి నీవు రాజు కాకపోతివే అని బాధపడి, ఇప్పుడు పాండవులను కుంతితోసహా వారణావతానికి పంపించు. ఈ రాజ్యం మొత్తం నా అధీనంలోనికి వచ్చిన తర్వాత వారు తిరిగి వచ్చి మనవద్దనే ఉండవచ్చు అని ఉపాయాన్ని చెప్పాడు (ఆది 141 అ.1-15శ్లో) అప్పుడు ధృతరాష్ట్రుడేమన్నాడో చూడండి.

**శ్లో॥ దుర్యోధన మమాప్యేతత్ హృది సంపరివర్తతే।**
**అభిప్రాయస్య పాపత్వాన్ నైవంతు వివృణోమ్యహం ॥**
**(ఆది 141అ. 16శ్లో)**

తా॥ దుర్యోధనా! నా హృదయంలో కూడా ఇదే విషయం తిరుగాడుతూ ఉంది. అయితే మనవారంతా ఈ ఆలోచన పాపంతో కూడినదంటున్నారు. అందుకే నేనీ విషయాన్ని బహిరంగంగా చెప్పలేకపోతున్నాను; భీష్మాదులు పాండవులకు అన్యాయం చేయటాన్ని సహించరు.

– దీనితో ధృతరాష్ట్రుడెలాంటివాడో గమనించవచ్చు. పాండవులను అంతం చేయటానికి ఎంతటి పాపానికైనా ఒడిగట్టగలడు. అయితే తన చుట్టూ ఉండే పెద్దలు తనను పాపపుపనులు చేస్తున్నాడని అనుకోరాదు. అంటే వారికి తెలియకుండా ఎన్ని పాపాలు చేయటానికైనా సిద్ధమే. ఇదీ పాండవులపట్ల ధృతరాష్ట్రుని సౌహార్దం.

(V) కుంతీపాండవులు జీవించే ఉన్నారని, లక్క ఇంటి నుండి తప్పించుకొని, ద్రుపదపురం చేరి ద్రౌపదిని వివాహమాడి బలపడ్డారని తెలుసుకున్న దుర్యోధనుడు, కర్ణ శకునులతో ఆలోచించి, కర్ణుని వెంటబెట్టుకుని తండ్రివద్ద కెళ్ళాడు. అప్పుడే విదురుడు ధృతరాష్ట్రునితో మాట్లాడి వెళ్ళిపోతున్నాడు. అప్పుడు తండ్రితో దుర్యోధనుడు, "తండ్రీ! విదురుడెప్పుడూ మీ దగ్గరే ఉండటం వల్ల మీరు చేస్తున్న తప్పులను ఎత్తిచూపటం వీలుకావటంలేదు. శత్రువులైన పాండవుల ఉన్నతిలోనే మన ఉన్నతి ఉన్నదని, మీరు విదురునితో అంటున్నారు. మేమేమో పాండవుల శక్తిని నాశనం చేయాలనుకుంటున్నాము. ఏమి చేయాలి? అన్నాడు. (ఆది 199 అ. 28-31శ్లో)

దానికి ధృతరాష్ట్రుడేమని సమాధానం ఇస్తున్నాడు? నాయనా! మీరిద్దరూ ఏమిచేయాలనుకుంటున్నారో నేను అదే చేయాలనుకుంటున్నాను. అయితే నా మనస్సులోని భావా లేమిటో విదురునకు తెలియకుండా జాగ్రత్తపడుతుంటాను. అందుకే నేను విదురుని సమక్షంలో పాండవులను విశేషంగా ప్రశంసిస్తూ ఉంటాను. ధానితో అతడు నా భావాన్ని కనిపెట్ట లేదు. నాయనా! ఈ సమయంలో ఏమి చేయటం అవసరమని మీరిద్దరూ అనుకుంటున్నారో వెంటనే నాకా విషయం చెప్పండి- అన్నాడు ధృతరాష్ట్రుడు. (ఆది 200 అ. 1-3శ్లో)

ఇదీ ధృతరాష్ట్రుని బుద్ధి. ఇట్టి ధృతరాష్ట్రుడు పాండవులపై సౌహార్దంతో యౌవరాజ్య పట్టాభిషేకం చేశాడట.

(VI) ద్రౌపదీ వస్త్రాపహరణం తర్వాత ఘోరమైన ఉత్పాతాలు గోచరింపగా- గాంధారీ, విదురులు గోలపెట్టగా, ద్రౌపదిని పిలిచి వరాలు కోరమని; పాండవులను దాస్య విముక్తులను చేసి, వారి రాజ్యాన్ని వారికిచ్చి పంపించాడు ధృతరాష్ట్రుడు. అప్పుడు దుర్యోధనుడు తండ్రివద్దకు వచ్చి పాండవులను తిరిగి రప్పించి 12 ఏళ్ళు వనవాసము, 1 ఏడు అజ్ఞాతవాసం పణంగా తిరిగి జూదం ఆడించాలని కోరినప్పుడు-భీష్మద్రోణ కృపాచార్య విదురులు, బాహ్లిక సోమదత్త భూరిశ్రవులు, యుయుత్సు, వికర్ణులు తిరిగి జూదం వద్దని మొరబెట్టారు. అప్పుడు గాంధారి కులక్షయానికి నీవు కారణం కావద్దని భర్తను హెచ్చరించగా ధృతరాష్ట్రుడు,

**శ్లో॥ అంతఃకామం కులస్యాఽస్తున శక్నోమి నివారితుం।**
**యధేచ్ఛంతి తధైవాస్తు ప్రత్యాగచ్ఛంతు పాండవాః॥**
**పునర్ద్యూతం చ కుర్వంతు మామకాః పాండవైస్సహ॥**
**(సభా 74అ)**

తా॥ కులక్షయం కానిమ్ము. నేను నివారించలేను. వీరన్నట్లుగా పాండవులు తిరిగిరావలసిందే. మనవారు వారితో జూదమాడవలసిందే-అన్నాడు. ఇదీ ధృతరాష్ట్రుని మనస్తత్వం. ఇట్టి ధృతరాష్ట్రుడు సౌహార్దం వల్ల ధర్మజుని యౌవరాజ్యాభిషిక్తుని చేశాడట; తన కుమారునికి హక్కు ఉన్నప్పటికి, రాజ్యాన్ని కుమారునికి ఇవ్వక తమ్ముని కుమారునికి కట్టబెట్టాడట. దానికి కారణం ధృతరాష్ట్రునికి పాండవులపై సౌహార్ధమట. బ్రహ్మయ్య శాస్త్రులుగారి వాదన ఎంత సమంజసంగా ఉందో, ఎంత సొంపుగా ఉందో గమనించాలి.

పౌరుల ఒత్తిడివల్లనైతేనేమి, కురువంశపెద్దల మాటపై నైతేనేమి, గత్యంతరం లేని పరిస్థితులలో అధికారి అయిన ధర్మజునికి రాజ్యాభిషేకం చేయవలసివచ్చింది. తన చేతినుండి రాజ్యాధికారం జారిపోవటాన్ని ఇష్టపడని ధృతరాష్ట్రుడు; పరుల సొమ్ముకు ఆశపడే ధృతరాష్ట్రుడు; ఎన్ని పాపాలైనా చేసి, ఎన్ని ఎత్తులైనా ఎత్తి రాజ్యాన్ని పాండవులకు దక్కకుండా చేసి, ఎలాగైనా తన కుమారుడికి కట్టబెట్టాలనే దుష్టబుద్ధిగల కుటిలాత్ముడైన ధృతరాష్ట్రుడు అప్పటికి ధర్మరాజును యౌవరాజ్యాభిషిక్తుని చేసి, పెద్దలను, పౌరులను చల్లబరచి, ఆ తర్వాత ఏదో ఒక మాయోపాయంపన్ని రాజ్యం తమ చేతినుండి జారిపోకుండా చూసుకోవచ్చునని ఎత్తు వేసినాడు. అందుకే యౌవరాజ్యాభిషేకం జరిపించాడని మనకు మహాభారతకథ ద్వారా తేటతెల్లమవుతున్నది. పాండవులపట్ల ద్వేషం, అసూయయేతప్ప ఏమాత్రము వాత్సల్యము లేదని ఋజువుచేయటమైనది. ఈ యౌవరాజ్యాభిషేకం వల్ల కూడా ధర్మజుడే రాజ్యంపై హక్కుదారు అని తెలిసిపోతున్నది.

**(4) దుర్యోధనునకే రాజ్యంపై హక్కు ఉంటే దుర్యోధన పట్టాభిషేకానికి ఎవరు అడ్డు వస్తారు? పాండవులను లక్క ఇంట తగలబెట్టాలనే దుర్బుద్ధి ఎందుకు?**

జ: నిజంగా దుర్యోధనునికి హక్కుంటే అతణ్ణే రాజుగా

– లేదా యువరాజుగా అభిషేకించవచ్చు. ధర్మరాజును అభిషేకించి, ఆ తర్వాత వారినెలాగైనా తుదముట్టించాలనే ఆలోచన ఎందుకు చేసినట్లు? హక్కుదారైన ధర్మరాజు, సోదరులు అందరూ మరణిస్తే, ఇక దుర్యోధనునికే పట్టం గట్ట వచ్చుననే గదా పాండవులను వారణావతం బంపి లక్క ఇంటి ఉంచినది! ఒకవేళ పాండవులైదుగురు మరణించినా కుంతీదేవి మిగిలిఉంటే, ఆ కుంతీదేవికైనా పట్టం గట్టాలని పెద్దలు పట్టుబడతారేమోననియే పాండవులతో సహా కుంతీ దేవిని కూడా లక్కయింట అగ్నికి ఆహుతిచేయ తలపెట్టారు దుష్ట దుర్యోధన ధృతరాష్ట్రులు. దీనిని బట్టి కూడా రాజ్యంపై హక్కు పాండవులకేనని స్పష్టం. వారికా హక్కే లేకపోతే ఇన్ని ఎత్తులు ఎత్తాల్సిన పనేలేదు. హక్కున్న దుర్యోధనుని పట్టాభిషిక్తుని చేయవచ్చు గదా!

పాండవులు కుంతీదేవితో సహా లక్కయింట దగ్ధమైనారని తెలిసిన తర్వాత దొంగ ఏడుపులు ఏడ్చి, వారికి ఉత్తరక్రియలు కూడా జరిపించాడు ధృతరాష్ట్రుడు. ఆ తరువాత కూడా దుర్యోధనునికి పట్టం గట్టాలనే మాటను ధృతరాష్ట్రుడు వెంటనే పెద్దల వద్ద ప్రస్తావించలేదు. దీనికి కారణం బహుశా పట్టాభిషేకానికి తొందరపడితే, పాండవులను లక్కయింట మట్టుబెట్టింది తామేనని బయటపడుతుందోమోనని భయంకావచ్చు. ఈ మొత్తం విషయాన్ని బట్టికూడా "రాజ్యాధికారి ధర్మరాజే గాని దుర్యోధనుడు కాదు" అనే విషయం రూఢి అవుతున్నది.

–రాజ్యంపై హక్కు ఎవరిదో నిరూపించే మరొక గొప్ప ఆధారం గాంధారీ గర్భతాడనం. గర్భతాడనం వెనుకగల మర్మం ఏమిటి?

(వచ్చే సంచికలో)

# వార్తామాలిక



## మార్గశిర శుద్ధ ఏకాదశి 'గీతాజయంతి' సందర్భంగా జరిగిన ఉత్సవములో మహాత్మాగాంధీ యోగవిద్యాలయం

మార్గశిర శుద్ధ ఏకాదశినాడు భగవద్గీత పుట్టినరోజు. ఆ రోజున శ్రీసత్యసాయి ధ్యానమండలి నిర్వహిస్తున్న యోగవిద్యాలయాలు రెండింటా 'గీతాశ్లోక పఠన పోటీలు' నిర్వహింపబడ్డాయి.


గీత మొత్తం 18 అధ్యాయాలలో విద్యార్థులకు అత్యంత ఉపయుక్తమైన 16వ అధ్యాయం–దైవాసుర సంపద్విభాగ యోగంలోని 24 శ్లోకాల్లో పోటీ జరిగింది.

విద్యార్థులంతా యోగనిష్ఠతో పోటీల్లో పాల్గొన్నారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా సాగిన ఈ పోటీలో, విద్యార్థులు 'దైవాసుర' లక్షణాలను గొంతెత్తి చాటారు. సాయంత్రం జరిగిన గీతాజయంతి ఉత్సవములో పాల్గొన్న ప్రముఖులు మొదటగా శ్రీకృష్ణుని కీర్తిస్తూ సాగిన గీతాలకు కోలాటంతో చేసిన నృత్యాలకు ఆశ్చర్యానందాన్ని ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు 'గీత'తో తలరాతలు ఎలా మార్చుకోవచ్చునో తెలిపారు. విజేతలకు భీమవరం సీనియర్ సిటిజన్ ఫోరం వారు సర్టిఫికెట్లను, బహుమతులను అందించారు.

మంచిని పెంచుకుంటూ, మన సంస్కృతి.. సంప్రదాయాలను గౌరవిస్తూ, అందలి గొప్పదనాన్ని నలుదిశలా వ్యాపించేలా చేయడం భారతీయులుగా మన కర్తవ్యం. లోక కళ్యాణాన్ని, అందలి మంచిని, శాంతిని, హితాన్ని కోరేది మన సంస్కృతి.. మన ధర్మం! ధర్మమార్గంలో దైవీసంపదతో పయనించి ధన్యజీవులుగా మారాలని విద్యార్థులను పెద్దలంతా ఆశీర్వదించారు.

భగవద్గీతను విధిగా బాల్యం నుండే అధ్యయనం చేయించాలనీ, గీత ప్రసాదించే దివ్యజ్ఞానంతో ప్రతి విద్యార్థి యశశ్శ్రీలతో శోభించాలని ఆకాంక్షించారు.

భగవద్గీతలో ఏ అధ్యాయాన్ని స్పృశించినా జీవితం సార్థకమౌతుంది. మంచితనానికి మంచిరోజులు వచ్చి, మనసంతా దైవీసంపదతో నిండిపోయేందుకే శ్రీసత్యసాయి ధ్యానమండలి గీతాయజ్ఞం చేస్తుంది.



# మహాభారతం

## కురుసామ్రాజ్యాధిపత్య నిర్ణయము 14

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

(5) కురుసామ్రాజ్యంపై హక్కు ధర్మరాజుకే గాని దుర్యోధనునకు లేనే లేదను గొప్ప ఋజువు 'గాంధారీ గర్భతాడనం. గాంధారి గర్భతాడనం చేసుకొనుటకు – రాజ్యంపై హక్కుకు గల సంబంధం ఏమిటి? గర్భతాడనం వెనుక గల మర్మమేమిటి?

జ: గాంధారి గర్భం ధరించింది. 2 సంవత్సరాలు గడిచినా ప్రసవం కాలేదు. పిండం శిలలాగా కదలిక లేకుండా ఉన్నది. అదే సమయంలో కుంతీదేవి సూర్యసమాన తేజస్సు గల పుత్రుని కన్నదనే వార్త వచ్చింది. దానితో ఆమెకు దుఃఖం కలిగింది. (దుఃఖ మావిశత్) మూర్ఛపోయింది. తేరుకోగానే ఆ దుఃఖావేశంలో ధృతరాష్ట్రునికి తెలియకుండానే ఆమె తన ఉదరంపై కొట్టుకున్నది. ఆ దెబ్బకు గర్భం నుండి లోహపిండం వంటి గట్టి మాంసంపిండం బయటపడింది. (ఆది 114అ. 9–12శ్లో)

అంతట వ్యాసభగవానుడక్కడ ప్రత్యక్షమై 'ఎందుకిలా చేశావ'ని మందలించాడు. అప్పుడు గాంధారి–

**శ్లో॥ సాచాత్మనో మతం సత్యం శశంస పరమర్షయే।**
**జ్యేష్ఠం కుంతీసుతం జాతం శృత్వారవి సమప్రభం॥**
**(ఆది 114అ.15శ్లో)**

**శ్లో॥ దుఃఖేన పరమేణీదం ఉదరం ఘాతితం మయా।**
**(ఆది 114 అ.16శ్లో)**

**తా:** తన మనస్సులోని సత్యమైన మాటను ఇలా చెప్పింది, "మహర్షీ! కుంతీదేవికి సూర్యసమతేజస్సుతో జ్యేష్ఠపుత్రుడు జన్మించాడని విన్నాను. ఇది వినగానే గొప్పదుఃఖం కలిగింది. అందుకే గర్భతాడనం చేసుకున్నాను" అని.

తోడికోడలు కుంతీదేవి ముందుగా బిడ్డను కన్నంత మాత్రాన తన గర్భంపై కొట్టుకోవలసిన అవసరమేమిటి? ఆమె గాంధారదేశరాకుమారి, మహాప్రాజ్ఞురాలు. సామాన్య స్త్రీ కాదు. దీని వెనుక ఏదో మర్మం ఉండి ఉండాలి.

ఈ గాంధారీ గర్భతాడనంపై కొందరు కౌరవపక్షాభిమానులైన విమర్శకులు "యుద్ధ ప్రారంభంలో ఆశీస్సుల కొరకై దుర్యోధనుడు తల్లికి నమస్కరించినప్పుడు 'యతోధర్మస్తతో జయః' ధర్మమెచ్చటనో విజయమచ్చటనే అని స్థిర సంకల్పంతో చెప్పిన ధర్మజ్ఞురాలు. తన భర్త అంధుడు గనుక తాను కూడా జీవితాంతము వరకు కన్నులకు గంతలు కట్టుకొన్న మహాపతివ్రత, దీర్ఘదర్శి, మహాప్రాజ్ఞురాలు ఐన గాంధారి ఇటువంటి అకార్యం ఆచరిస్తుందా? కనుక ఇది కల్పితం. మహాభారతాన్ని వ్యాసుడు పక్షపాతంతో వ్రాశాడు" అని సిద్ధాంతీకరించారు.

తమ బుద్ధికి అనుకూలంగా ఉన్న సంఘటనలను సత్యమని, తమ బుద్ధికి వ్యతిరేకంగా ఉన్నవాటిని కల్పితమని చెప్పే వీరి మాటలను గ్రంథ విషయాలను తెలుసుకున్న వారు ఎవరూ నమ్మరు. గాంధారి ధర్మజ్ఞురాలు, ప్రాజ్ఞురాలు, మహాపతివ్రత, దీర్ఘదర్శి అని వ్రాసిందీ వ్యాసుడే. గాంధారి గర్భతాడనం చేసుకున్న విషయాన్ని వ్రాసిందీ వ్యాసుడే. ఇందులో పక్షపాతం వ్యాసుడిదో–విమర్శకులదో అర్థమవుతూనే ఉన్నది. అసలు మహాభారతాన్ని వ్యాసుడు పక్షపాతంతో వ్రాస్తే ఆ గ్రంథాన్నే ఎందుకు ఆధారంగా తీసుకోవటం? పక్షపాతం లేకుండా వ్రాసిన మహాభారతాన్ని వీరు బయట పెట్టవచ్చుగదా! లేక మహాభారత కాలంలో జరిగిన కథ ఏదో వ్యాసునికి తెలియకపోతే; అప్పటి మహాభారత గాధను ప్రత్యక్షంగా చూచిన వీరు మహాభారత గ్రంథాన్ని వ్రాసి లోకానికి అందించి మానవులను ఉద్ధరించవచ్చు గదా! అదేదీ చేయకుండా ఇలా అస్తవ్యస్తంగా విమర్శిస్తే ప్రయోజనమేమిటి?

ఇక మరికొందరు విమర్శకులు తోడికోడలైన కుంతీదేవికే

ముందుగా పుత్రుడు జన్మించాడనే స్త్రీ సహజమైన అసూయతో గాంధారి గర్భతాడనం చేసుకున్నదే గాని, మహాప్రాజ్ఞురాలైన గాంధారి ఇలాంటి అవ్యక్తమైన పనిచేయునా? అని విమర్శించారు.

పాపం ఈ విమర్శకులకు తాము ఏమి మాట్లాడుతున్నారో తమకే తెలియటం లేదు. గాంధారి మహాప్రాజ్ఞురాలని వీరే చెబుతూ, ఆమెకు స్త్రీ సహజమైన అసూయ అట. అంటే మహాప్రాజ్ఞురాలైతే అసూయ ఉంటుంది కాబోలు. అందునా తోడికోడలకి ముందుగా బిడ్డ పుట్టినందుకు. ఎక్కడైనా తోడికోడలకి ముందుగా బిడ్డపుడితే అసూయపడతారేమో గాని గర్భం మీద కొట్టుకునే అవివేకులు ఎక్కడా ఉండరు. అసలు గర్భం అనేది వస్తే కొంచెం వెనుకాముందుగా తనకూ బిడ్డ కలుగుతుందని సరిపెట్టుకుంటారు. కాని ఇక్కడ అలా జరుగలేదు. దీనికి ఏదో గొప్పకారణం ఉండి ఉండాలి. అంత గొప్పకారణం లేకపోతే గర్భతాడనం చేసుకొనేంతటి అవివేకి కాదు గాంధారి. ఏమిటా కారణం?

జ్యేష్ఠ కుటుంబంలో ఉండవలసిన కురుసామ్రాజ్యాధికారం ఆనాటితో తన కుటుంబం నుండి శాశ్వతంగా జారిపోతున్నదే అనే దుఃఖావేశమే గాంధారి గర్భతాడనానికి అసలైన కారణం. రాజ్యాధికారం ఎందుకు తన కుటుంబం నుండి జారిపోతున్నది?

రాజ్యాధికార విషయాలను గురించి ఆనాటి చట్టం సాంప్రదాయం ఏమిటో "వీరమిత్రోదయం అనే గ్రంథంలోని 6వ భాగం రాజనీతి ప్రకాశిక"లో శ్రీమిత్ర మిశ్ర అనువారు ఇలా తెలియజేశారు. "జన్మచేతగాని, ఇతర దోషముల చేతగాని, అంగవైకల్యం చేతగాని జ్యేష్ఠుడు రాజ్యాధికారాన్ని కోల్పోయి, అతని సోదరుడు (కనిష్ఠుడు) రాజ్యాభిషిక్తుడై రాజ్యము నేలుచున్నను, వానికంటే ముందుగా జ్యేష్ఠుడే పుత్రవంతుడైతే – ఆ కనిష్ఠుని తర్వాత జ్యేష్ఠుని కుమారుడే రాజవుతాడు. అలాగాకుండా రాజ్యాభిషిక్తుడైన కనిష్ఠుడే జ్యేష్ఠుని కన్న ముందుగా పుత్రవంతుడైతే ఇక అతడే రాజ్యానికి హక్కుదారవుతాడు"

దీనిని బట్టి ధృతరాష్ట్ర పాండురాజులలో ఎవరికి ముందుగా సంతానం కలుగుతుందో అతడే ఉత్తరాధికారి. అంటే ధృతరాష్ట్రుడు అంధత్వం వల్ల రాజ్యాన్ని కోల్పోయినప్పటికీ అతని పుత్రుడు గనుక జ్యేష్ఠుడై, అంధత్వాది దోషాలు లేకపోతే, తిరిగి రాజ్యం అతడికే దక్కుతుంది. అలాగాక కనిష్ఠుడై, రాజ్యాభిషిక్తుడైన పాండురాజే ముందుగా పుత్రవంతుడైతే ఇక పరంపరాగతంగా రాజ్యం పాండు వంశీయులదే. ఇది అప్పటిరాజనీతి. ఈ విషయం అప్పటి రాజనీతిజ్ఞులందరికీ తెలుసు. అందుకే మహాప్రాజ్ఞురాలు, రాజనీతి విశారదురాలు ఐన గాంధారి–కుంతీదేవికే ముందుగా పుత్రుడు జన్మించాడు గనుక, అతడే జ్యేష్ఠుడు గనుక, ఇక ఈ రాజ్యాధికారం శాశ్వతంగా తమ కుటుంబం నుండి జారిపోయిందనే దుఃఖంతో, వివశురాలై గర్భతాడనం చేసుకున్నది. ఇదే విషయాన్ని వ్యాసునితో చెప్పేటప్పుడు "కుంతీదేవికి జ్యేష్ఠుడు జన్మించాడని విన్నాను, గొప్ప దుఃఖం కలిగింది, అందుకే గర్భతాడనం చేసుకున్నాను" 'జ్యేష్ఠం కుంతీసుతం జాతం' అని స్పష్టంగానే అన్నది.

ఇక్కడ గాంధారికి రాజ్యసంబంధమైన చింత గనుక లేకపోతే జ్యేష్ఠం అని జ్యేష్ఠ శబ్దాన్ని కుంతీపుత్రునకు ఎందుకు ఉపయోగించింది. పోనీ అతడు కుంతీపుత్రులలో జ్యేష్ఠుడు అనుకుందామా అంటే అప్పటికి కుంతీదేవికి మరొక పుత్రుడే లేడు గదా! తోడికోడలకి బిడ్డ జన్మించాడనే స్త్రీ సహజమైన అసూయయే ఐతే జ్యేష్ఠ శబ్దం ఎందుకు వాడినట్లు? తామిద్దరిలో ఎవరికి ముందుగా బిడ్డ పుడితే అతడే జ్యేష్ఠుడు. అతడే రాజ్యాధికారి. కనుకనే రాజ్యాధికారం కుంతీపుత్రునకే దక్కుతున్నదని, తన పుత్రునికి రాజ్యాధికారం లేకపోతున్నదే అనే బాధతో వివశురాలై గర్భతాడనం చేసుకున్నది గాంధారి.

ఈ గాంధారీ గర్భతాడనం వల్ల కురుసామ్రాజ్యానికి ఉత్తరాధికారి కుంతీపుత్రుడు యుధిష్ఠిరుడే (ధర్మరాజే) అని ఋజువౌతున్నది. దుర్యోధనునకు హక్కులేదని తెలుస్తున్నది.

ఇక– "పాండవులకు రాజ్యాధికారం లేనేలేదు. రాజ్యంపై సంపూర్ణ హక్కు దుర్యోధనునిదే" అని వాదించే వారి చేతిలో గల గొప్ప వజ్రాయుధం గురించి విచారణ చేద్దాం.

(6) దుర్యోధనునకు రాజ్యంపై హక్కు లేకపోతే కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సమయంలోనే కర్ణునికి అప్పటికప్పుడే అంగరాజ్యాన్ని ఎలా కట్టబెట్టాడు? అప్పుడు పాండవులెందుకు వ్యతిరేకించలేదు?

ఈ విమర్శపై ఇద్దరు ప్రముఖుల అభిప్రాయాలేమిటో చూద్దాం.

I) స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, శతావధాని, బారిష్టర్ శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి గారు తమ 'కురుక్షేత్ర సంగ్రామం' అనే గ్రంథంలో "పాండవులకు రాజ్యాధికారం లేనేలేదని, వారు రాజ్యకాంక్షతో యుద్ధాన్ని తలపెట్టారని, యుద్ధంలో వారు పొందినది అధర్మ విజయమ'ని వ్రాశారు. ఆ గ్రంథంలో రాజ్యాధికారం విషయాన్ని ఏమని వ్రాశారో చూద్దాం.

"సుయోధనుడు యువరాజో, రాజో కాకపోతే కుమార విద్యా ప్రదర్శన కాలంలో కర్ణునికి అంగరాజ్యమిచ్చుటకు ఎట్లు

అర్హుడు? బాల్యచాపల్యముచే సుయోధనుడిచ్చితిమన్నను భీష్మాదులేల మాట్లాడకుండిరి? అని వీరి విమర్శ.

II) ఇదే విషయంపై కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రులు గారు తమ 'ధాయభాగ వినిర్ణయములో' ఇలా వ్రాశారు.

అస్త్రప్రదర్శన కాలమందు కర్ణుడు రాజుకాడు గాన రాజపుత్రుడగు అర్జునునితో యుద్ధము చేయదగడు-అనే ఆక్షేపము రాగా, ఆ లోపాన్ని పూరించుటకు దుర్యోధనుడు, అతడిని అంగదేశాధీశునిగా చేసెదనని చెప్పి, తక్షణం అంగదేశానికి పట్టాభిషేకం చేసినాడు. రాజ్యము పాండవులదాయె. దుర్యోధనునకు అదెంతమాత్రము అంశము లేదాయె. అట్టిచో పాండవులు గాని, ఆ పక్షము వారుగాని కర్ణునికి అంగదేశమునిచ్చుటకు నీకు అధికార మెక్కడిది? అని ఎందుకు ప్రశ్నవేయరైరి? అనిన నిరుత్తరమగును గదా! (అంటే సమాధానం చెప్పలేక తెల్లమొగం వేస్తారు గదా)

ఈపై ఇద్దరి విమర్శలు ఒకేరకమైనవి గనుక ఇద్దరికీ కలిపి సమాధానం ఇద్దాం.

జ: కర్ణునికి అంగరాజ్యాన్ని నిరాటంకంగా ఇవ్వటం వల్ల, పాండవులు గాని, పెద్దలు గాని ఆక్షేపించినందువల్ల దుర్యోధనుడే సంపూర్ణహక్కుదారని, అతడు యువరాజో, రాజో అయి ఉండవచ్చునని త్రిపురనేని రామస్వామి చౌదరిగారు వాదించారు. ఈ వాదన నిలుస్తుందా? అసలు దుర్యోధనుడు యువరాజో, రాజో అయినట్లు గ్రంథంలో ఎక్కడన్నా ఉన్నదా? ఉంటే ఆ ప్రమాణాన్ని చూపకుండా వీరు ఊరుకుంటారా? మూలభారతంలో గాని, ఆంధ్రమహాభారతంలో గాని ఎక్కడా దుర్యోధన పట్టాభిషేకం ప్రసక్తే లేదు. కనుక దుర్యోధనుడు రాజు కాదు, యువరాజూ కాదు. ఇక కర్ణునికి అంగ రాజ్యాన్నిచ్చినది కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయంలో. అంటే కురు పాండవులు విద్యలు నేర్చుకోవటం పూర్తయిన తర్వాత తన శిష్యుల విద్యలను ప్రదర్శించుటకు ద్రోణాచార్యుడు ఏర్పాటు చేసిన సమావేశంలో. అప్పటికి దుర్యోధనుడు బాలుడే. కనుక రాజై ఉంటాడని ఊహించటానికి కూడా వీలు లేదు. ఎందుకంటే అప్పుడు ధృతరాష్ట్రుడే సింహాసనంపై ఉన్నాడు. అప్పుడే కాదు మహాభారత యుద్ధం జరిగేవరకు కూడా ధృతరాష్ట్రుడే రాజు. పోనీ యువరాజు అనుకుందామా? అంటే అదీ కుదరదు. ఎందుకంటే అప్పటి వరకు ధర్మరాజు కూడా యువరాజు కాదు. కుమారాస్త్ర విద్యాప్రదర్శన తర్వాత ఒక సంవత్సరానికి ధర్మరాజును యువరాజుగా అభిషేకించాడు ధృతరాష్ట్రుడు.

**శ్లో॥ తతః సంవత్సరస్యాంతే యౌవరాజ్యాయ పార్థివ।**
**స్థాపితో ధృతరాష్ట్రేణ పాండుపుత్రో యుధిష్ఠిరః॥ (ఆది 138 అ.1శ్లో)**

అంతట ఒక సంవత్సరం గడిచిన తర్వాత ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరుని యువరాజపదవినందు అభిషిక్తుని చేసెను- అని మూలభారతంలో స్పష్టంగా ఉన్నది. ఇదే విధంగా ఆంధ్రమహాభారతంలో కూడా ఆదిపర్వం షష్టాశ్వాసంలో "అంత ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరుని రాజ్యభార దురంధరునిగా యెరింగి, భీష్మ విదురులతో విచారించి యౌవరాజ్య పట్టాభిషిక్తుని చేసెను" అని స్పష్టంగా ఉన్నది. కుమారాస్త్ర విద్యాప్రదర్శన తరువాత సంవత్సరానికి ధర్మరాజు యువరాజైతే ఇపుడే దుర్యోధనుడు రాజో యువరాజో అయి ఉండవచ్చుననుట ఎలా కుదురుతుంది?

పోనీ గ్రంథంలో ఎక్కడా చెప్పక పోయినా రహస్యంగా ధృతరాష్ట్రుడు ఎప్పుడో చేశాడులే అనుకుందామా అంటే- పాపం ఆ దుర్యోధనుడే ధర్మజయౌవరాజ్యాభిషేకం తరువాత తండ్రి వద్దకు వచ్చి ఏకాంతంలో "తండ్రీ! నేనసలే పాండవులకు భయపడుతున్నాను. నీవిప్పుడు ధర్మజుని యువరాజుగా చేశావు. ఆ తర్వాత రాజవుతాడు. ఇక నేను, నా పుత్రపౌత్రులు వారిని కొలిచి జీవించాల్సిందేనా?" అని దుఃఖించాల్సిన పనేముంది? దుర్యోధనుడే రాజోయువరాజో అయితే పాండవుల చేతికి రాజ్యం చిక్కకుండా ఉండేందుకు ఎత్తులు, పై ఎత్తులు వేసుకోవాల్సిన అవసరం ఆ తండ్రీ కొడుకుల కెందుకు?

దుర్యోధనుని సుయోధనునిగా మార్చి, గ్రంథవిషయాన్ని వ్యత్యస్తం చేసి, మహాభారతం తప్పులతడక అని, యుద్ధంలో అధర్మం జయించిందని నిరూపిస్తే వారికి ప్రయోజనం ఏమిటో?

ఏ హక్కు అధికారము లేకపోతే దుర్యోధనుడు కర్ణునికి అంగరాజ్య మెలా ఇచ్చాడు? అనేది ఇపుడు విచారణీయాంశము.

కర్ణునికి అంగరాజ్య ప్రదానం చేసింది కుమారాస్త్ర విద్యాప్రదర్శనా సమయంలో. ఈ విషయం ఆంధ్రమహాభారతంలో ఎలా ఉన్నదో చూద్దాం.

"ఎల్లవారును జూడంగ నీ క్షణంబ రాజుచేసెద నేనంగ రాజ్యమిచ్చి-

**వ.** అని యపుడ భీష్మధృతరాష్ట్రులకుం జెప్పి, వారి యనుమతంబున.. అంగరాజ్యంబున కభిషిక్తుంజేసిన...' (ఆం.మ.భా. ఆది షష్టాశ్వాసం)

ఇదే విషయం మూలభారతం (ఆది. 135 అ.37శ్లోకం) లో కూడా అలాగే ఉన్నది.

**శ్లో॥ తతోరాజాన మామంత్ర్య గాంగేయంచ పితామహం।**
**అభిషేకస్య సంభారాన్ సమానీయ ద్విజాతిభిః ॥**

ఆ తర్వాత దుర్యోధనుడు ధృతరాష్ట్రుని యొక్క పితామహుడు గాంగేయుని యొక్క అనుమతితో అభిషేకానికి అవసరమైన సంబరాలను సమకూర్చమని బ్రాహ్మణులను కోరాడు.

దీనిని బట్టి ధృతరాష్ట్రుని యొక్క భీష్ముని యొక్క అనుమతితో జరిగినదే. అంగరాజ్య ప్రదానం. వారి అనుమతి తోనే దుర్యోధనుడు చేశాడు గనుక దుర్యోధనునకు రాజ్యంపై సంపూర్ణ హక్కులేదని తేలిపోయింది. దుర్యోధనునకు హక్కు లేకపోయినా ధృతరాష్ట్రునకున్నది గదా! అంటారేమో- సంపూర్ణ హక్కు ధృతరాష్ట్రునకుంటే భీష్ముని అనుమతి ఎందుకు?

ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తుడైన రాజు కాదు, పట్టాభిషిక్తుడైన పాండురాజు వనాలకు వెళుతూ ధృతరాష్ట్ర విదురులకు రాజ్యాన్ని వప్పగించివెళ్ళాడు. కనుక ధృతరాష్ట్రుడు ఏ పనిచేసినా భీష్ముని అంగీకారం, విదురుని సమ్మతి కూడా ఉండాలి. అందుకే భీష్మ ధృతరాష్ట్రుల అనుమతిపై జరిగినది ఈ అంగరాజ్య ప్రదానం.

(I) సరే, బాల్యచాపల్యంతో దుర్యోధనుడు ఇస్తానన్నా ధృతరాష్ట్రుడెందుకు అంగీకరించాడు? ఎందుకంటే- దుర్యోధనుడు చెప్పినదానికి బద్ధుడై ప్రవర్తించేవాడు ధృతరాష్ట్రుడు. అతడికి కుమారునిపై వల్లమాలిన మమకారం. పాండవులను వారణావతానికి పంపించాలని కుమారుడు కోరినప్పుడు "పెద్దలు దీనికి అంగీకరించరు" అని కుమారునితో చెబుతూనే కుంతీదేవితో సహా పాండవులను వారణావతానికి పంపించాడు. 'జూదం సకల అనర్థాలకు మూలం' అని విదురుడు చెబుతున్నా వినకుండా, తన కుమారుని కోరిక మేరకు ఆ విదురునే పంపి పాండవులను ద్యూతానికి ఆహ్వానింపజేశాడు, జూదంవల్ల సర్వనాశనమౌతుందని విదురుడెంత మొత్తుకున్నా వినకుండా జూదాన్ని కొనసాగించటం లోను, ద్రౌపదిని సభకు రప్పించటంలోను, వస్త్రాపహరణం లోను కుమారుని అభీష్టానికి మౌనంగా తలాడించాడు ధృతరాష్ట్రుడు, తన ఆదేశంపై ధర్మజాదులు తిరిగి ఇంద్రప్రస్థానికి వెళుతుండగా, కుమారుడు వారిని తిరిగి రప్పించి పునర్ద్యూతం ఆడించాలని కోరినప్పుడు-గాంధారీ విదురులు ఎంత మొత్తుకున్నా వినకుండా ప్రాతిగామిని పంపి, మార్గమధ్యం నుండే పాండవులను రప్పించి, తిరిగి జూదం ఆడించాడు. భీష్మద్రోణ, కృప, విదుర, గాంధారి, నారదాది మహర్షులు, చివరకు వ్యాసమహర్షి సంజయుడు ఎవరు ఎన్ని విధాలుగా యుద్ధం వద్దు అని మొత్తుకున్నా వినకుండా శ్రీకృష్ణరాయబారాన్ని తిరస్కరించి, కుమారుని అభీష్టం ప్రకారం, యుద్ధానికే పచ్చజెండా ఊపాడు. ఇలా కుమారునికి అధీనుడై ప్రవర్తించేవాడు ధృతరాష్ట్రుడు. కనుకనే దుర్యోధనుని అభీష్టాన్ని అంగీకరించాడు.

(II) ధృతరాష్ట్రుడు కుమారునిపై మమకారంవల్ల బద్ధుడై అంగీకరించాడు. సరే మరి భీష్ముడెందుకు అంగీకరించాడు? ధృతరాష్ట్ర, పాండురాజులపై సమాన వాత్సల్యం గల భీష్ముడు పాండురాజ మరణానంతరం ధృతరాష్ట్రునిపై ఎంతో వాత్సల్యంతో ఉంటున్నాడు. మరీ దుర్మార్గంగా వ్యవహరిస్తుంటే సలహా చెప్పటం హెచ్చరించటమేగాని తీవ్రంగా వ్యతిరేకించే స్థితిలో లేడు. పైగా ఇపుడు అంగరాజ్యానికి రాజు లేడు. ఎవరో ఒకరిని నియమించాలి. కర్ణుడు బలపరాక్రమాలు కలిగినవాడే కాదు ధృతరాష్ట్రునికి మిత్రుడు, సారథి అయిన అతిరథుని కుమారుడు. కురుపాండవుల కన్నా ముందునుండే కృపాచార్యుని వద్ద విద్యలు నేర్చుకుంటూ, ద్రోణాచార్యుడు వచ్చిన తర్వాత కుమారులతో కలిసి ఆయనవద్ద సర్వశస్త్రాస్త్ర విద్యలు నేర్చుకున్నవాడు. కనుక కర్ణుని వ్యతిరేకించ వలసినంతటి కారణమేమీ కనిపించటం లేదు. అందుకే ధృతరాష్ట్రుని ఇష్టాన్ని వ్యతిరేకించలేదు. అలాగే విదురుడు కూడా భీష్మునిలాగానే తన సమ్మతిని తెలియజేశాడు.

(III) దుర్యోధనుని కోరికను ధృతరాష్ట్రుడెందుకు వ్యతిరేకించలేదో, ధృతరాష్ట్రుని చర్యను భీష్ముడెందుకు వ్యతిరేకించలేదో తెలుసుకున్నాం. ఇప్పుడు హక్కులేని దుర్యోధనుడు కర్ణునికి అంగరాజ్యం కట్టబెడుతుంటే హక్కున్న పాండవులు గాని, తత్పక్షమువారుగాని ఎందుకు వ్యతిరేకించలేదు? అనే బ్రహ్మయ్య శాస్త్రులు గారి వాదనను పరిశీలిద్దాం. ముందుగా పాండవు లెందుకు వ్యతిరేకించలేదో చూద్దాం.

పుత్రస్నేహంతో, పక్షపాత బుద్ధితో కుమారునికి వశుడైయున్నవాడు ధృతరాష్ట్రుడు. ఆ ధృతరాష్ట్రుడు చెప్పినదానికి బద్ధులై ఉన్నవారు పాండవులు. అందుకే వారు వ్యతిరేకించ లేదు. పాండవులు ధృతరాష్ట్రుని మాటకు బద్ధులై ఉండేవారేనా? అవును, ధృతరాష్ట్రుని ఆజ్ఞకు బద్ధులమై ఉండటం మా వ్రతం" అని వారణావత యాత్రకు వెళ్తూ యుధిష్ఠిరుడు పురజనులతో స్పష్టంగా చెప్పాడు.

**శ్లో॥ పితామాన్యో గురుశ్రేష్ఠో యథాహ పృథివీ పతిః**
**అశంకమానైః తత్కార్యం అస్మాభిరితి నోవ్రతం ॥**

**(ఆది 144 అ.15శ్లో)**

తా॥ పురజనులారా! ధృతరాష్ట్రుడు మాకు గౌరవించదగిన

తండ్రి, గురువు, శ్రేష్ఠపురుషుడు, ఆయన ఏ ఆజ్ఞ ఇస్తే దానిని నిస్సందేహంగా నెరవేరుస్తాం. ఇది మా వ్రతం అన్నాడు ధర్మరాజు.

ఇట్టి వ్రతాన్ని బట్టే కుమారాస్త్ర విద్యాప్రదర్శనానంతరం ప్రజాభిప్రాయం ప్రకారం రాజ్యాభిషేకం చేయకుండా కుటిలనీతితో యౌవరాజ్యాభిషేకం చేస్తే అంగీకరించాడు. అగ్నికి ఆహుతి చేయాలనే ఆలోచన మనస్సులో పెట్టుకొని 'వారణావతానికి వెళ్ళి, అక్కడ కొన్ని నాళ్ళుండి రమ్మంటే సరేనని తల్లిని, సోదరులను వెంటబెట్టుకొని వెళ్ళాడు. ద్రౌపదీ వివాహానంతరం తిరిగి హస్తినాపురికి రమ్మని విదురునిచే కబురంపితే' అంగీకరించి వచ్చాడు. 5సంవత్సరముల తర్వాత ఘోరారణ్య ప్రాంతమైన ఖాండవప్రస్థాన్ని అర్ధరాజ్యంగా ఇస్తున్నాను వెళ్ళండి అంటే అంగీకరించి వెళ్ళాడు. అక్కడ సామ్రాజ్యాన్ని నిర్మించుకొని సర్వసంపదలతో తులతూగుతూంటే దుర్యోధన ప్రేరితుడై సుహృద్ద్యూతానికి రమ్మని ఆహ్వానిస్తే వచ్చాడు. ఆ జూదంలో సర్వాన్నీ కోల్పోయి, ద్రౌపదీ వస్త్రాపహరణం జరిగినప్పుడు, ఉత్పాతాలకు భయపడిన ధృతరాష్ట్రుడు మీ రాజ్యం మీకిస్తున్నాను వెళ్ళండి' అంటే తిరిగి ఇంద్రప్రస్థానికి బయలుదేరాడు. తిరిగి దుర్యోదనుని కోరికతో పునర్ద్యూతానికి రమ్మని ప్రాతిగామితో కబురంపితే మార్గమధ్యం నుండే తిరిగివచ్చాడు. ఇలా తండ్రి మరణానంతరం హస్తినాపురానికి వచ్చిన ధర్మరాజు ఎన్ని కష్టనష్టాలెదురైనా, తప్పయినా, ఒప్పయినా ధృతరాష్ట్రుడు చెప్పినదానికి కట్టుబడి, ఆయన ఆజ్ఞను తు.చ. తప్పక పాటించాడు. సోదరులంతా అన్నను అనుసరించారు. కనుకనే ధృతరాష్ట్రుని ఆజ్ఞకు బద్ధులై పాండవులు అంగరాజ్యాభిషేకాన్ని వ్యతిరేకించలేదు. పెద్దవారైన తర్వాతనే ఆయన ఆజ్ఞను తిరస్కరించనివారు బాల్యంలో వ్యతిరేకిస్తారా?

(IV) ఇక పాండవులపై ప్రేమ, వాత్సల్యం ఉన్న కృపద్రోణులెందుకు వ్యతిరేకించలేదు? జరుగుతున్నది అస్త్రవిద్యా ప్రదర్శనం. కర్ణుడు అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయాలనే కోరికను వెలిబుచ్చాడు. ద్వంద్వయుద్ధ నియమాలు తెలిసిన కృపాచార్యుడు అర్జునుని కులగోత్రాదులను తెలిపి, అర్జునునితో ద్వంద్వ యుద్ధం చేయాలనుకున్న నీ కులగోత్రాలను తెలుపమన్నాడు. కర్ణుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. అప్పుడు దుర్యోధనుడు 'రాజైన వానితో రాజే ద్వంద్వ యుద్ధం చేయాలంటే నేనిప్పుడే కర్ణుని అంగరాజ్యాభిషిక్తుని చేస్తాన'ని ప్రకటించాడు, భీష్మ, ధృతరాష్ట్రుల అనుమతితో ఏర్పాట్లు చూస్తున్నాడు.

ఇట్టి స్థితిలో కర్ణుని అంగరాజ్యాభిషేకాన్ని తాము వ్యతిరేకిస్తే "అర్జునుడు కర్ణుని ధాటికి నిలువలేడు గనుక కర్ణుని చేతిలో అర్జునుని ఓటమిని, పరాభవాన్ని తప్పించేందుకే ఆచార్యులు ఈ ఎత్తు ఎత్తారు అనే అపప్రథరావచ్చు. అది అర్జునునికి న్యూనతను, కర్ణునికి లేనిపోని గొప్పతనాన్ని తామేకట్టబెట్టినట్లవుతుంది- అనే శంకతో కృపద్రోణులు మౌనం వహించారు. కర్ణార్జునులిరువురూ తమ శిష్యులే. వారి బలపరాక్రమాల గురించి తెలియనివారు కాదు. పైగా భీష్మవిదురుల సమ్మతితో ధృతరాష్ట్రుడు చేస్తున్న దానికి అభ్యంతరం చెప్పాల్సినంతటి కారణం కూడా గురువులైన తమకు లేదు. అందుకే వ్యతిరేకించలేదు.

"కర్ణునికి అంగదేశము నిచ్చుటకు నీకధికారమెక్కడిది? అని పాండవులు గాని, ఆ పక్షమువారు గాని ఎందుకు ప్రశ్న వేయరైరి? అనిన పాండవ పక్షాభిమానులు నిరుత్తరులౌతారు గదా! అంటే సమాధానం చెప్పలేరు గదా!" అన్న బ్రహ్మయ్య శాస్త్రులుగారు ధృతరాష్ట్రుడెందుకు కుమారుని మాటను వ్యతిరేకించలేదో, భీష్ముడెందుకు అంగీకరించాడో, పాండవులెందుకు వ్యతిరేకించలేదో, కృపద్రోణులెందుకు వ్యతిరేకించలేదో తెలుసుకుంటే ఆయనగాని, ఆయన అభిప్రాయాలనే విశ్వసించేవారు గాని నిరుత్తరులు కాక తప్పదు గదా! చాలా గొప్పగా దుర్యోధనునకు రాజ్యంపై హక్కున్నదని వాదించిన వారు తెల్లమొఖం వేయక తప్పదుగదా!

ప్రతివాదులు దుర్యోధన పక్షపాతంతో, అభూతకల్పనలతో, కుతర్కాలతో, గ్రంథంలో ఉన్నదానిని వ్యత్యస్తం చేసి దుర్యోధనునకు హక్కును కల్పించాలని నానాతంటాలు పడ్డారేగాని, వారి వ్రాత ధర్మసమ్మతం కాదు న్యాయసమ్మతం కాదు గ్రంథ సమ్మతం కాదు-అని గ్రహించాలి.

కురుసామ్రాజ్యంపై చట్టబద్ధమైన, ధర్మబద్ధమైన, న్యాయబద్ధమైన హక్కు పాండవజ్యేష్ఠుడైన ధర్మరాజుదేనని నిరూపితమైనది.

దీనితో 'కురుసామ్రాజ్యాధిపత్యనిర్ణయం' అనే ఈ ప్రకరణాన్ని ముగిస్తున్నాం. ఇక పాండవ ధార్తరాష్ట్రులలో ధర్మాత్ములెవరు? దురాత్ములెవరు? ఈ విషయంలో మహాభారత గ్రంథం ఏమి చెబుతున్నది? మహాభారతాన్ని మనకందించిన వ్యాసమహర్షి ఏమి చెబుతున్నాడు?

(వచ్చేసంచికలో)